## అహ్మదియ్యా వార్తలు

సయ్యిద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు అల్లాహ్ దయతో క్షేమంగా ఉన్నారు. **(అల్ హందులిల్లాహ్)**

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ కొరకు ప్రత్యేముగా దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ అన్వర్‌కు ఆరోగ్యవంతమైన, చురుకైన సుదీర్ఘ జీవితంను ప్రసాదించుగాకా!. ఉన్నత ఆశయ సాధనాలను నమకూర్చు గాకా!,అనుక్షణం హుజూర్‌ను రక్షించుచూ దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! *(ఆమీన్)*

اَللّٰھُمَّ اَیِّدْ اِمَامَنَا بِرُوْحِ الْقُدُسِ
وَبَارِکْ لَنَا فِیْ عُمُرِہٖ وَاَمْرِہٖ


بِسْمِ اللّٰہِ الرَّحْمٰنِ الرَّحِیْمِ نَحْمَدُہٗ وَنُصَلِّیْ عَلٰی رَسُوْلِہِ الْکَرِیْمِ وَعَلٰی عَبْدِہِ الْمَسِیْحِ الْمَوْعُوْد

وَلَقَدْ نَصَرَكُمُ اللّٰهُ بِبَدْرٍ وَّاَنْتُمْ اَذِلَّةٌ (ఆలె ఇమ్రాన్:124)

**సంపాదకులు:** సయ్యద్ రసూల్ నియాజ్

**ఉపసంపాదకులు:** ముహమ్మద్ అక్బర్

# బదర్

(Telugu)వార పత్రిక ఖాదియాన్

Weekly **BADAR** Qadian

www.akhbarbadr.in

సంపుటి: **10** సంచిక : **45**

వార్షిక చందా 600/-రూ॥

**06 నవంబర్ 2025 క్రీ, శ. 06 నబువ్వత్ ఇఖా 1404 హి, శ.**

**14 జమాదిఉల్ అవ్వల్ 1447 హి,ఖ.**


## పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

وَاَنْفِقُوْا فِیْ سَبِیْلِ اللّٰهِ وَلَا تُلْقُوْا بِاَیْدِیْكُمْ اِلَى التَّهْلُكَةِ ۛ وَاَحْسِنُوْا ۛ اِنَّ اللّٰهَ یُحِبُّ الْمُحْسِنِیْنَ ○

(سورۃ البقرۃ:196)

**అనువాదం:** అల్లాహు మార్గములో ఖర్చు చేయుము. చేతులారా వినాశనమును కోరి తెచ్చుకోకుము. మంచినే చేయుడు. నిశ్చయముగా ఉపకారం చేయువారిని అల్లాహ్ ప్రేమించును.

**(బఖరహ్:196)**

## గుర్తుంచుకోవలసిన విషయమేనగా, విజయం చివరికి దేవుని దాసులనే వరిస్తుంది. హత్యాయత్నం, అవిశ్వాస ఫత్వాలు, వివిధ రకాల బాధలు ఏవియు వారికి ఎలాంటి నష్టాన్ని చేకూర్చలేదు.

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ వ మహ్దియే మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారి ఉపదేశాలు:

మానవున్ని నాశనం చేయువాటిలో చెడు స్నేహం కూడ ఒకటి. చూడండి!. అబూజహల్ స్వయముగా నాశనం అవ్వడమే కాకుండా, తన వద్దకు వచ్చి కూర్చునే వారిలో అనేక మంది ప్రజలను కూడ నాశనం చేశాడు. అతని సాన్నిహిత్యంలో, సమావేశాలలో హస్యములు, హేళనలు, హేవగింపులు తప్ప మరెలాంటి ప్రస్తావన జరుగేది కాదు. ఎల్లప్పుడు "**ఇన్న హాజ లషైఉన్ యురాద్** అనగా మిత్రులారా! ఇదొక వ్యాపారమే" అని పలికేవాడు.

ఇప్పుడు ఆలోచించి చెప్పండి!. అతడు ఏ కార్యమునైతే వ్యాపారము, మోసము అని పలికేవాడో, నేడు ప్రపంచం మొత్తంలో అట్టి కార్యపు తేజస్సు ప్రకాశిస్తుందా? లేక మరేదైన ప్రకాశిస్తుందా?. అబూజహల్ చనిపోయాడు. అతడిపై శాపనార్థాలు పెట్టేవారు తప్ప మరెవరు లేరు. కాని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి అత్యంత వైభవాన్ని చూడండి!. రాత్రింభవళ్ళు, నిజం చెప్పాలంటే ప్రతిరోజు వారిపై దరూద్‌ను పంపడం జరుగుతుంది. 99 కోట్ల మంది ముసల్మానులు వారికి శిష్యులుగా ఉన్నారు. ఒకవేళ అబూజహల్ మరల జన్మించినచో, అతనికి కనిపించే దృశ్యమేమనగా, ఏ చిన్న అవకాశాన్ని వదల కుండా హింసించినా మక్కా వీదులలో ఒంటరిగా తిరుగుతూ కనిపించిన వ్యక్తి, వారి నలువైపుల 99 కోట్ల మంది మానవులు గుమికూడి ఉండడాన్ని చూసినచో అతడు ఆశ్యర్యపోతాడు. ఈ దృశ్యమే అతడిని మరల చంపివేస్తుంది. ఇదే ప్రవక్త (స) గారి ప్రవక్తుత్వానికి సత్యనిదర్శం. ఒకవేళ అల్లాహ్ తాలా తోడుగా నిలువనిచో ఇంతటి విజయం లభించేది కాదు. ప్రవక్త (స) పట్ల ఉన్న శత్రుత్వం మరియు వ్యతిరేకత వలన ఎన్నెన్నో వ్యూహాలు, ఎత్తుగడలు వేశారు. కాని చివరికి అవన్నియు వృధా అయ్యాయి, నిరాశపరిచాయి. ఆనాటి ప్రారంభకాలంలో కొంత మందే ప్రవక్త (స)కు తోడుగా ఉండడాన్ని చూసినవారిలో , ఈ మహోన్నతుడు అన్ని రకాల వ్యతిరేకతలు, ఎత్తుగడల నుండి సురక్షితముగా బయటపడి విజయాన్ని సాధిస్తారని, ప్రపంచంలో స్థిరస్థాయిగా నిలుస్తారని ఎవరు భావించారు.

కాని గుర్తుంచుకోవలసిన విషయమేనగా, విజయం చివరికి దేవుని దాసులనే వరిస్తుంది. హత్యాయత్నం, అవిశ్వాస ఫత్వాలు, వివిధ రకాల బాధలు ఏవియు వారికి ఎలాంటి నష్టాన్ని చేకూర్చలేదు. అల్లాహ్ తాలా సత్యమునే పలికాడు.

**యురీదూన లియుత్ఫిఊ నూరల్లాహి బి అఫ్వాహిహిం వల్లాహు ముత్తిమ్ము నూరిహీ వలౌ కరిహల్ కాఫిరూన్** (అస్సఫ్: 9) ఈ దుష్టఅవిశ్వాసులు తమ నోటి ఊదులతో అల్లాహ్ తేజస్సును ఆర్పివేయాలనుకుంటున్నారు. కాని అల్లాహ్ తాలా తన తేజస్సును పరిపూర్ణం చేయాలనుకుంటున్నాడు. అవిశ్వాసులు అయిష్టపడిన కూడ.

నోటి ఊదులంటే ఏమిటి?. కొందరు మోసగాడు అని అంటారు, మరికొందరు వ్యాపారం అని అంటారు, కొందరు మార్గభ్రష్టుడు, అధర్మికుడు అని అంటారు. మొత్తానికి ప్రజలు ఇలాంటి మాటలతో అల్లాహ్ ఆకాంక్షను అడ్డుకోవాలని చూస్తుంటారు. కాని వారు అనుకున్నది సాధించలేరు. అల్లాహ్ తేజస్సును ఆర్పివేసే ప్రయత్నంలో వారే స్వయముగా కాలి బూడిదై పోతారు.

అల్లాహ్ దాసుల సైన్యం ఆకాశంలో ఉంటుంది. వ్యతిరేకులు, ప్రాపంచికులు ఆ సైన్యాన్ని చూడలేరు. ఒకవేళ వారికి తెలిసినచో, ఏ కొద్దిగా కనిపించినచో వారు భయంతోనే చచ్చిపోతారు. నిజానికి అల్లాహ్ అభయంలోకి చేరనంత వరకు మానవులకు ఆ సైన్యం కనిపించదు. **(మల్ఫూజాత్ సంపుటి 2, పేజి 68-69, ఎడిషన్ 2018, ఖాదియాన్).**

## 130 వ జల్సా సాలానా (వార్షిక సభ) ఖాదియాన్

సయ్యిద్నా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 130 వ జల్సా సాలానా (వార్షిక సభ) ఖాదియాన్ కొరకు 26,27,28 డిశంబర్ 2025 (శుక్రవారం, శనివారము, ఆదివారము) తేదీలను ఆమోదించినారు. ఇప్పటి నుండే జమాఅత్ సభ్యులు ఈ పవిత్ర సభలో పాల్గొనుటకు సంకల్పించి సన్నాహాలు ప్రారంభించగలరు. ఈ ఆధ్యాత్మిక సభతో ప్రయోజనము పొందే అనుగ్రహము అల్లాహ్ మనందరికి కలిగించుగాక! ఈ వార్షిక మహాసభ అన్ని విధాలా విజయవంతమగుటకు, దీని ద్వారా సత్యవంతులు మార్గదర్శనము పొందాలని ప్రార్థనలు చేయగలరు. అల్లాహ్ అందరికి ఉత్తమ ప్రతి ఫలములు అందించు గాక!

**(నాజిర్ ఇస్లాహ్ ఇర్షాద్ దక్షిణ భారత దేశపు ఖాదియాన్)**

## మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనాలు

■హజ్రత్ అబూజర్ రజియల్లాహు అన్హు ఇలా ఉల్లేఖించారు. నేను దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో ఉన్నాను. ప్రవక్త (స) ఉహద్ పర్వతాన్ని చూసి ఇలా అన్నారు: ఒకవేళ ఈ పర్వతాన్ని నా కోసం బంగారు పర్వతంగా మార్చబడినచో, ఇందులో ఒక దినార్ కూడ మూడు రోజుల కంటే ఎక్కువ నా వద్ద ఉంచుకోవడానికి నేను ఇష్టపడను. ఆ౦ అప్పు తీర్చుటకైనచో నిల్వ ఉంచెదను. ప్రవక్త (స) మరల ఇలా తెలిపారు: ఎవరైతే ఈ విధముగా సంపదను ఖర్చు చేస్తారో వారిని మినహాయించి మిగిలిన వారందరు ఎంత సంపన్నులైతే అంత ఎక్కువ ఆశ పరులు.

**ఇన్నల్ అక్‌సరీన హుముల్ అఖల్లూన్:**

హజ్రత్ సయ్యద్ జైనులాబిద్దీన్ వలి ఉల్లాహ్ షా గారు ఇలా తెలిపారు. ఈ వాక్యము విభిన్న అర్థాలను కల్గిన సంపూర్ణ వాక్యము. దీని అర్థమేమనగా, కేవలం ధనమును సమకూర్చువారినే ధనవంతులు అనరు. నిజానికి చాలా మంది ధన వంతులు తమ సద్గుణాలను కోల్పోవడం వలన అభాగ్యులుగా మిగిలిపోతారు. అందుకే ధనమును సమకూర్చువారే ధనవంతులు కారు, చుట్టు ప్రక్కల వారిపై ఖర్చు చేయువారే అసలైన ధనవంతులు. అనగా ధార్మిక, ప్రాపంచిక ఆకాంక్షలను నెరవేర్చడం కోసం ఖర్చు చేయడంతో ధన సేకరణ లక్ష్యం నెరవేరుతుంది. ఎవరైతే ధనమును సమకూర్చుకోని, ఇతరుల హక్కులను చెల్లించడో అతడే అందరి కంటే ఎక్కువ దురదృష్టవంతుడు. కాని ఎవరైతే తన ధనముతో ఇతరుల హక్కులను నెరవేర్చుతాడో అతడే అసలైన ధనవంతుడు. ఎందుకనగా అతడే ధనము యొక్క అసలు ఉద్దేశాన్ని నెరవేర్చినవాడును. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ధనము పట్ల ఇలాంటి దృకోణంను కల్గియుండడం అత్యున్నత స్థాయి వివేకతకు నిదర్శనం. **(సహీ బుఖారి, కితాబుల్ ఇస్తఖ్రాజ్, సంపుటి 4, ప్రచురణ 2008, ఖాదియాన్)**


జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రొపరైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

# జుమా ప్రసంగము

హజ్రత్ ఖలీద్ బిన్ వలీద్ రజి ఇలా తెలిపారు. "మౌతా యుద్ధం రోజున, నా చేతిలో తొమ్మిది ఖడ్గాలు విరిగిపోయాయి. కేవలం ఒక విశాలమైన యెమెన్ ఖడ్గం మాత్రమే నా చేతిలో మిగిలిపోయింది."

ముస్లింలు చాలా మంది విగ్రహారాధకులను చంపారని ఈ కథనం ద్వారా తెలుస్తుంది. లేకపోతే, ముస్లిం వారి నుండి తప్పించుకోలేక పోయేవారు. ఎందుకనగా ముస్లింల సంఖ్య 3,000మాత్రమే, కాని విగ్రహారాధకులు 200,000 కంటే ఎక్కువ మంది ఉన్నారు. ఈ ఘటన ముస్లింల ఆధిపత్యానికి బలమైన మరియు స్థిరమైన ఆధారంగా నిలుస్తుంది.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తన ప్రసంగ వేదికపై నిలబడి హజ్రత్ జైద్ రజి, హజ్రత్ జాఫర్ రజి, మరియు హజ్రత్ ఇబ్న్ రవాహ రజి వీరమరణంను గూర్చి ప్రజలకు తెలియజేశారు. నిజానికి వారి వీరమరణ వార్తను తెలియజేయుటకు ఎవరు రాలేదు. ఆ రోజే వారు వీరమరణం పొందారు.

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ రజి, హజ్రత్ జాఫర్ రజి కుమారుడు అబ్దుల్లాను పలకరించినప్పుడల్లా, అతను ఇలా పలికేవారని పేర్కొనబడింది. అస్సలాము అలైక యా ఇబ్న జీల్ జనాహైని. అనగా "రెండు రెక్కలు కలిగినవారి కుమారుడా, నీకు శాంతి కలుగుగాకా!"

"కొన్ని సమస్యాత్మక విషయాల విషయానికి వస్తే, కొంతమంది వాటిని అర్థం చేసుకుంటారు, మరికొందరు అర్థం చేసుకోరు. ఆయా అంశాలపై అవగాహన ఉన్నవారు, స్వయముగా అర్థం చేసుకోలేని వారికి వాటిని వివరించాలి."

మరొక యుద్ధ ప్రస్తావన గలదు. దీనిని హజ్రత్ అమర్ బిన్ ఆస్ రజి యుద్ధం అని పిలుస్తారు. ఈ యుద్ధం హిజ్రి 8వ సం॥ జమాదిఉస్సాని లో జరిగింది. ఈ యుద్ధానికి గల కారణం ఇలా గలదు. మదీనాపై దాడి చేయుటకు బనూ ఖుజాఅకు చెందిన వారు సైన్యాన్ని సమీకరిస్తున్నారని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు సమాచారం అందింది. ఈ ఖుజాఅ తెగవారు ఖహ్‌తానీయుల వర్గానికి చెందినవారు. పైగా వీరు మదీనా నుండి 10 రోజుల ప్రయాణ దూరంలో ఉన్నటు వంటి ఖురా లోతట్టు ప్రాంతం ముందు నివాసం ఉంటున్నారు.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ అమర్ రజి నాయకత్వంలో ముహాజిర్లు మరియు అన్సార్లును కలిపి 300ల మందితో సైన్యాన్ని ఏర్పాటు చేశారు. వారిలో 30 మంది అశ్వదళ సైనికులు కూడ ఉన్నారు. ప్రవక్త (స) హజ్రత్ అమర్ రజి కోసం ఒక తెల్లటి పతాకమును ఏర్పాటు చేశారు. తోడుగా మరొక నలుపు రంగు పతాకమును కూడ ఇచ్చారు.

భారతదేశం, పాకిస్తాన్‌ల మధ్య నెలకొన్న యుద్ధ పరిణాలను గూర్చి కూడ చాలా ఎక్కువగా దుఆలు చేయండి. అనగా వారి మధ్య సయోధ్య మరియు శాంతి నెలకొల్పబడాలని విస్తృతంగా దుఆలు చేయండి. అదేవిధంగా, పాలస్తీనా ప్రజల కోసం దుఆలు చేయండి. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వారికి సౌకర్యాన్ని కల్పించుగాకా!. వారు తమ దేశంలో శాంతియుతంగా జీవించుదురు గాకా!.

**సయ్యిద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 09 మే 2025, ( 09 హిజ్రత్ 1404 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهُ لَا شَرِيْكَ لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُوْلُهُ
أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ ـ بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ
اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ۔ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ۔
اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ۔
صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ۔

మౌతా యుద్ధానికి సంబంధించిన మరిన్ని వివరాలు ఇలా ఉన్నాయి: హజ్రత్ ఔఫ్ బిన్ మాలిక్ అష్జిహి రజి ఇలా చెబుతున్నారు, "నేను హజ్రత్ జైద్ బిన్ హారిస్ రజితో పాటు బయలుదేరిన వ్యక్తులతో కలసి ప్రయాణిస్తున్నాను. నేను యెమెన్ నుండి వచ్చిన ఒక వ్యక్తిని కలిశాను, అతని వద్ద ఖడ్గము మాత్రమే ఉంది. మరొక ముస్లిం ఒక ఒంటెను వధించాడు, మరియు యెమెన్ నుండి వచ్చిన వ్యక్తి ఒంటె చర్మంలో కొంత అడిగాడు, అందుకు ఆ ముస్లిం వ్యక్తి అతనికి ఇచ్చాడు. ఆ తరువాత అతను మరి కొంత చర్మం అడిగాడు. ఆపై దానిని ఒక కవచంలా మార్చాడు." అష్జిహి ఇలా తెలిపారు. "మేము మా ప్రయాణాన్ని కొనసాగించాము. రోమన్ సైన్యంతో యుద్ధం జరిగింది. ఒక వ్యక్తి గోధుమ రంగు గుర్రంపై స్వారీ చేస్తున్నాడు. దానికి బంగారు అంబారీ మరియు బంగారు ఆయుధలు ఉన్నాయి. ఆ రోమన్ సైనికుడు ముస్లింలను రెచ్చగొట్టడం ప్రారంభించాడు. అప్పుడు యెమెన్ వ్యక్తి ఒక బండరాయి వెనుక నుండి అతని వద్దకు చేరుకొని శత్రువు గుర్రపు కాళ్ళను నరికివేసాడు. యుద్ధం ప్రారంభమైనది. రోమన్ సైనికుడు క్రింద పడి పోయాడు. యెమెన్ వ్యక్తి తన ఖడ్గంతో అతనిపై ఎక్కి అతన్ని చంపాడు. ముస్లిం వ్యక్తి రోమన్ సైనికుడిని చంపాడు. కావున అతని గుర్రాన్ని మరియు ఆయుధాలను తీసుకున్నాడు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ముస్లింలకు విజయాన్ని ప్రసాదించినప్పుడు, హజ్రత్ ఖలీద్ బిన్ వలిద్ రజి యమన్ వ్యక్తికి ఒక సందేశాన్ని పంపాడు. అతని నుండి కొంత సామాగ్రిని అడిగాడు. అనగా రోమన్ సైనికుడిని చంపిన యమన్ వ్యక్తికి నీవు తీసుకున్న సామాగ్రిని జమా చేయమని సందేశం పంపాడు. హజ్రత్ ఔఫ్ రజి మరల ఇలా తెలిపారు. నేను హజ్రత్ ఖాలిద్ రజి వద్దకు చేరుకోని " ఇట్టి సామాగ్రిని గూర్చి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఎలాంటి ఆదేశాన్ని ఇచ్చారో మీకు తెలుసా?" అని అడిగాను. ఖాలిద్ బిన్ వలీద్ నూతనంగా ఇస్లాంను స్వీకరించాడు. అందుకే వారికి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశంను గూర్చి బహుశ తెలిసి ఉండక పోవచ్చునని భావించాను. అనగా అట్టి సామాగ్రి హత్య చేసిన వ్యక్తికే చెందుతాయి అనే విషయం. అనగా ఎవరైతే శత్రువును చంపుతారో అట్టి చంపిన వ్యక్తి వద్దనే శత్రువు సామాగ్రి, సంపద ఉంటుంది. అందుకు ఖాలిద్ బిన్ వలీద్ రజి ఆఁ! నాకు ఆ విషయం తెలుసు. కాని నేను అతని వద్ద ఎక్కువ సంపద ఉన్నట్లు గుర్తించాను అని అన్నారు. అనగా అతనికి లభించవలసిన సామాగ్రి కంటె ఎక్కువ సామాగ్రి అతను తీసుకున్నాడు. ఔఫ్ రజి ఇలా తెలిపారు. నేను ఖాలిద్ రజితో యమన్ వ్యక్తికి అట్టి సామాగ్రిని తిరిగి ఇవ్వండి. లేనిచో నేను ఈ విషయాన్ని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు తెలియజేస్తాను అని అన్నాను. అయితే, హజ్రత్ ఖలీద్ రజి ఆ వస్తువులను తిరిగి ఇవ్వడానికి నిరాకరించారు." హజ్రత్ ఔఫ్ రజిమరల ఇలా తెలిపారు "తరువాత, మేము ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు చేరుకున్నాము. నేను ఈ సంఘటన గురించి మరియు హజ్రత్ ఖలీద్ రజి ప్రవర్తన గురించి ప్రవక్త (స)కు తెలియజేసాను. ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం హజ్రత్ ఖలీద్ రజిను నీవు ఏమి చేశావు? అని అడిగారు. అందుకు వారు రజి ఇలా అన్నారు: 'అతను తనకు రావాల్సిన దానికంటే ఎక్కువ తీసుకున్నాడని నేను నమ్మాను. అందువల్ల అతని నుండి కొంత తిరిగి తీసుకున్నాను.' ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు: 'మీరు అతని నుండి ఏమి తీసుకున్నారో, దానిని అతనికి తిరిగి ఇవ్వండి!" హజ్రత్ ఔఫ్ రజి ఇలా తెలిపారు. "నేను ఇలా అన్నాను: 'ఖాలీద్ ! ఇప్పుడు అతని నుండి తీసుకోండి. అంటే, ప్రవక్త

సల్లల్లాహు అలైహి వ సల్లం దానిని తిరిగి ఇవ్వమని మీకు ఆదేశించినందున, ఇప్పుడు మీరు దానిని ఎలా తీసుకుంటారు?. నేను దానిని తిరిగి ఇవ్వమని మీకు చెప్పలేదా?' మొత్తానికి హ్జ్రత్ ఖాలీద్ రజితో హ్జ్రత్ ఔఫ్ రజి ఈ విధముగా మాట్లాడుతుండగా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం విన్నారు. కావున ఏమి జరిగింది? అని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అడిగారు. ఔఫ్ రజి మళ్ళీ మొత్తం సంఘటనను ప్రవక్త (స)కు చెప్పారు. మొదట, వివరాలను వెల్లడించలేదు. అయితే, ఇప్పుడు అనగా నేను అతనికి సమాగ్రిని తిరిగి ఇచ్చివేయుము అని చెప్పాను. కాని ఖాలీద్ రజి ఇవ్వలేదు అని చెప్పాను. అందుకు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అసంతృప్తి చెందారు. ఆపై "ఖాలీద్, అతనికి అంత సామాగ్రిని తిరిగి ఇవ్వవద్దు" అని అన్నారు. ప్రవక్త (స) మొదట, అతనికి సామాగ్రిని తిరిగి ఇవ్వమని చెప్పారు, కానీ ఇప్పుడు అలా చేయవద్దని చెప్పారు. ఆ తరువాత, దైవ ప్రవక్త (స) వారి నైతిక శిక్షణ కోసం ఈ క్రింది విధంగా అన్నారు: "నేను నియమించిన నాయకులను ఈ స్థితిలో అనగా మీరు పవిత్రమైనదాన్ని పొంది, వారికి అపవిత్రమైన వాటాను వదిలివేయాలనుకుంటున్నారా?".ఎవరినైన నాయకుడిగా (అమీర్) నియమించబడినప్పుడు, మీ నిర్ణయం సరైనదని కాదని చెప్పడం. అలా చెప్పి అట్టి న్యాయబద్ధమైన నిర్ణయం లేదా సమగ్రమైన నిర్ణయంను తమకు ఆపాదించుకోని, ఏదైనా ప్రతికూల అంశం ఉన్నచో, దానిని నాయకులకు ఆపాదించబడం అనేది చాలా తప్పుడు వైఖరి. ఇప్పుడు నీవు ఘటనను వివరించి చెప్పావు గనుక నేను మొదటి ఆదేశాన్ని ఉపసంహరించుకుంటున్నాను. మరియు ఖలీద్ రజి చేసింది సరైనదే.

ఇక్కడ, అమీర్ యొక్క గౌరవాన్ని నిలబెట్టాలి, కాబట్టి ప్రవక్త (స) ఇలా అన్నారు. ఈ విధంగా, మీరు అమీర్ మొదట తప్పుగా వ్యవహరించారని సూచించడం అనేది, అతన్ని అవమానించమే అవుతుంది. అందుకే ప్రవక్త (స) తమ మొదటి నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు.

హ్జ్రత్ జాబిర్ రజి ఇలా ఉల్లేఖించారు. "మౌతా యుద్ధంలో, కొంతమంది ముస్లింలు వీరమరణం పొందారు. విగ్రహారాధకుల సంపదను ముస్లింలు యుద్ధ సంపదగా పొందారు. ఈ వస్తువులలో ఒక ఉంగరం ఉంది, దానిని ఎవరో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు బహుకరించారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆ ఉంగరాన్ని నాకు బహుమతిగా ఇచ్చారని నేను అతనితో చెప్పాను." హ్జ్రత్ ఖుజైమా బిన్ సాబిత్ రజి ఇలా తెలిపారు. "నేను మౌతా యుద్ధంలో పాల్గొన్నాను. ఒక రోమన్ సైనికుడు నన్ను ఒంటరి పోరాటానికి రమ్మని సవాలు చేశాడు. నేను అతనిని ఓడించాను. అతను కెంపులతో అలంకరించబడిన శిరస్త్రాణం ధరించాడు. నా ఉద్దేశ్యం ఆ కెంపులను తీసుకోవడమే. నేను వాటిని తీసుకున్నాను, మరియు నేను దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు చేరుకున్నప్పుడు, నేను వారికి ఆ కెంపులను సమర్పించాను. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వాటిని నాకు బహుమతిగా ఇచ్చారు." మరల ఇలా తెలిపారు. నేను "హ్జ్రత్ ఉస్మాన్ ఘనీ రజి కాలంలో, వాటిని వంద దినార్లకు అమ్మి, ఆ డబ్బుతో ఒక పండ్ల తోటను కొన్నాను." అల్లామా ఇబ్నే కసీర్ ఇలా పేర్కొన్నారు. ఈ కథనాలను చూసినచో ముస్లింలు యుద్ధ సంపదను సేకరించారని స్పష్టంగా అర్థమవుతుంది. యుద్ధ సంపదను సేకరించారు కావున దీనిని ఓటమిగా పరిగణించలేము. ఇక్కడ ఓటమి ప్రశ్న తలెత్తదు, ఎందుకంటే ఇది వారిని సురక్షితముగా తీసుక రావడానికి ఎంచుకున్న యుద్ధ వ్యూహం. మొత్తానికి, వారు శత్రు సైన్యాధిపతుల సంపదను సేకరించారు. వారి నాయకులను చంపారు అని ఇబ్నే కసీర్ గారు తెలిపారు.

హ్జ్రత్ ఖలీద్ బిన్ వలీద్ రజి ఇలా తెలిపారు. "మౌతా యుద్ధం రోజున, నా చేతిలో తొమ్మిది ఖడ్గాలు విరిగిపోయాయి. కేవలం ఒక విశాలమైన యెమెన్ ఖడ్గం మాత్రమే నా చేతిలో మిగిలిపోయింది."

అల్లామా ముహమ్మద్ బిన్ యూసుఫ్ ఇలా పేర్కొన్నారు. ముస్లింలు చాలా మంది విగ్రహారాధకులను చంపారని ఈ కథనం ద్వారా తెలుస్తుంది. లేకపోతే, ముస్లిం వారి నుండి తప్పించుకోలేక పోయేవారు. ఎందుకనగా ముస్లింల సంఖ్య 3,000మాత్రమే, కాని విగ్రహారాధకులు 200,000 కంటే ఎక్కువ మంది ఉన్నారు. ఈ ఘటన ముస్లింల ఆధిపత్యానికి బలమైన మరియు స్థిరమైన ఆధారంగా నిలుస్తుంది. వాస్తవం అల్లాహ్‌కే బాగా తెలుసు.

ఇబ్నే ఇస్‌హాఖ్ ఇలా ఉల్లేఖించారు. ముస్లిం సైన్యం యొక్క కుడి పార్శ్వానికి హ్జ్రత్ కుత్బా బిన్ ఖతాదహ్ రజి కమాండర్‌గా కొనసాగారు. వారు క్రైస్తవ తెగల నాయకుడైన మాలిక్ బిన్ రఫిలాపై దాడి చేసి అతన్ని చంపారు. హ్జ్రత్ కుత్బా రజి దీనిని గర్వంగా చెబుతూ అరబి పద్యంలో ఇలా పేర్కొన్నాడు. "నేను అరష్ కుమారుడు రఫిలాను అతని శరీరంలోకి లోతుగా దూసుక వెళ్ళే విధముగా ఈటెతో దాడి చేశాను. ఆపై ఆ ఈటె విరిగిపోయింది. నేను అతని మెడపై నిర్ణయాత్మక దెబ్బ కొట్టినప్పుడు, అతను సల్లం చెట్టు కొమ్మలా (ఇది ముళ్ళ చెట్టు) పడిపోయాడు. మేము అతని బంధువుల మహిళలను పశువుల గుంపు వలే తీసుక వచ్చాము.

హ్జ్రత్ అస్మా బింత్ అమీస్ రజి ఇలా అన్నారు, "హ్జ్రత్ జాఫర్ రజి మరియు అతనితో ఉన్నవారు అమరులైన రోజు, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మా ఇంటికి వచ్చారు. ఆపై 'జాఫర్ కుమారులను నా వద్దకు తీసుకురండి' అని అన్నారు. నేను వారిని ప్రవక్త (స) ముందుకు తీసుకువచ్చాను. ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం వారిని కౌగిలించుకున్నారు. ఆ సమయంలో ప్రవక్త (స) కన్నుల నుండి కన్నీళ్లు కారడం ప్రారంభించాయి. నేను, 'ఓ అల్లాహ్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం!. నా తల్లిదండ్రులు మీ కోసం అంకితమైపోవుదురు గాక! మీరు ఎందుకు ఏడుస్తున్నారు?. మీకు హ్జ్రత్ జాఫర్ రజి మరియు వారితో ఉన్నవారిని గురించి ఏమైనా సమాచారం అందినదా?" అని అడిగాను. అందుకు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం, "అవును, ఈ రోజు వారి తలలపై అమరవీరుల కిరీటం ఉంచ బడింది" అని బదులిచ్చారు. హ్జ్రత్ అస్మా రజి ఇలా అన్నారు, "నేను లేచి ఏడ్వడం ప్రారంభించాను. స్త్రీలు నా చుట్టూ గుమిగూడారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తన కుటుంబ సభ్యుల వద్దకు తిరిగి వెళ్ళారు. ప్రవక్త (స) ఇలా అన్నారు. 'జాఫర్ కుటుంబాన్ని మర్చిపోవద్దు. వారి కోసం కొంత ఆహారం సిద్ధం చేయండి. ఆమె ఈ రోజు తన భర్త మరణ బాధను ఎదుర్కొంటోంది."మరో మాటలో చెప్పాలంటే, ఆ రోజు వారి ఇంటికి ఆహారం పంపమని ప్రవక్త (స) ప్రజలకు సూచించారు.

హ్జ్రత్ అనస్ రజివిలా ఉల్లేఖించారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తన ప్రసంగ వేదికపై నిలబడి హ్జ్రత్ జైద్ రజి, హ్జ్రత్ జాఫర్ రజి, మరియు హ్జ్రత్ ఇబ్న్ రవాహ రజి వీరమరణంను గూర్చి ప్రజలకు తెలియజేశారు. నిజానికి వారి వీరమరణ వార్తను తెలియజేయుటకు ఎవరు రాలేదు. ఆ రోజే వారు వీరమరణం పొందారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు, "ఇప్పుడు హ్జ్రత్ జైద్ రజి ఇస్లాం జెండాను చేపట్టారు. (ఆ సంఘటనను ఆయన వివరిస్తున్నారు.) వారు వీరమరణం పొందారు. తరువాత హ్జ్రత్ జాఫర్ రజి ఇస్లాం జెండాను తీసుకున్నారు, వారు కూడా వీరమరణం పొందారు. అప్పుడు హ్జ్రత్ అబ్దుల్లా రజి ఇస్లాం జెండాను పట్టుకున్నారు. వారు కూడ వీరమరణం పొందారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ విషయాన్ని ప్రస్తావించు సమయంలో ప్రవక్త (స) కన్నుల నుండి కన్నీళ్లు కారుతున్నాయి. చివరికి అల్లాహ్ ఖడ్గాలలో ఒక ఖడ్గం ఇస్లాం జెండాను పట్టుకున్నది. అల్లాహ్ ముస్లింలకు విజయాన్ని ప్రసాదించాడు."

మరో కథనంలో ఇలా గలదు. హ్జ్రత్ యఅలా బిన్ ఉమయ్యా రజి మౌతా సైనికుల వార్తను ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు తీసుకువచ్చారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం ఇలా అన్నారు. "ఒకవేళ నీవు కోరుకుంటే, నాకు తెలియజేయవచ్చు, లేదా నీవు కోరుకుంటే, నేను నీకు వాటి గురించి చెబుతాను." దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు. నాకు కూడ అల్లాహ్ తాలా సమాచారంను అందించాడు. కావున నీవు ముందుగా నాకు చెప్పాలనుకుంటున్నావా? లేదా ఏమి జరిగిందో నేను నీకు చెప్పాలా?. అందుకు అతడు "ఓ అల్లాహ్ ప్రవక్తా! సల్లల్లాహు అలైహి వసల్లం, మీరు నాకు చెప్పండి." అని విన్నవించుకున్నాడు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆ మొత్తం సంఘటనను ఆయనకు వివరించారు. హ్జ్రత్ యఅలా రజి, "మిమ్మల్ని సత్యంతో పంపిన అల్లాహ్‌పై ప్రమాణం చేస్తున్నాను, జరిగిన ఘటనలలో ఒక్క భాగాన్ని కూడా మీరు వదలకుండా తెలిపారు. " అని అన్నారు.

ప్రవక్త (స) ఇలా అన్నారు, "అల్లాహ్ నా కొరకు నా ముందు అక్కడి భూభాగాన్ని ఎత్తిచూపించాడు. కావున నేను ఆ యుద్ధంను చూశాను.

నేను వారిని కలలో చూశాను. వారు బంగారంతో చేసిన పడకలపై విశ్రాంతి తీసుకుంటున్నారు. నేను హ్జ్రత్ అబ్దుల్లా బిన్ రవాహ రజి మంచం చూశాను మరియు అది కొద్దిగా వంకరగా కనిపించింది. నేను, 'దీనికి కారణం ఏమిటి?' అని అడిగాను. మిగతా ఇద్దరూ నేరుగా ముందుకు సాగారని, కానీ అబ్దుల్లా కొంత సంకోచం చూపించి ముందుకు సాగాడు" అని నాకు సమాచారం అందింది. అతని ఇట్టి సంకోచంను గూర్చి గత జుమా ప్రసంగంలో ప్రస్తావించబడింది. నేను యుద్ధంలో పాల్గొనకుండ ఉండాలనే ఆలోచన తనకు వచ్చిందని ఆయనే స్వయంగా చెప్పాడు.

మరొక కథనంలో ఈ విధముగా గలదు. దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు. "జాఫర్ రజి, జైద్ రజి మరియు ఇబ్న్ రవాహా రజి లనునా ముందు ప్రవేశపెట్టబడ్డారు. వారు మౌతాలో ఏర్పాటు చేయబడిన గుడారంలో ఉన్నారు. నేను హ్జ్రత్ జైద్ రజి మరియు హ్జ్రత్ ఇబ్న్ రవాహా రజి లను చూశాను. వారి మెడలు కొద్దిగా వంగి ఉన్నాయి, కానీ హ్జ్రత్ జాఫర్ రజి నిటారుగా నిలబడ్డారు మరియు అతని మెడలో ఎటువంటి గుంట లేదు. మొదటి ఇద్దరు మరణం సమీపించి నప్పుడు, వారు దాని నుండి దూరంగా ఉన్నట్లుగా, దానిని తప్పించుకొనుటకు

ప్రయత్నించినట్లుగా నాకు సమాచారం అందింది, కానీ హజ్రత్ జాఫర్ రజి అలా చేయలేదు. కావున సర్వశక్తిమంతుడైన అల్లాహ్ అతని చేతులకు బదులుగా, అతనికి రెండు రెక్కలను ఇచ్చాడు, దానితో అతను తనకు నచ్చిన చోట స్వర్గంలో తిరుగుతాడు.

మరొక కథనంలో ఇలా గలదు, హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ రజి, హజ్రత్ జాఫర్ రజి కుమారుడు అబ్దుల్లాను పలకరించినప్పుడల్లా, అతను ఇలా పలికేవారని పేర్కొనబడింది. **అస్సలాము అలైక యా ఇబ్న జీల్ జనాహైని.** అనగా "రెండు రెక్కలు కలిగినవారి కుమారుడా, నీకు శాంతి కలుగుగాకా!"

**(సుబులుల్ హుదా వర్రిషాద్, వాల్యూమ్. 6, దారుల్ కుతుబుల్ ఇల్మియా, బీరూట్, పేజీలు 151-154)**

వివిధ ఆంశాలను వివరంగా తెలియపరుస్తూ హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ రజియల్లాహు తాలా అన్హు ఇలా ప్రస్తావించారు. "కొన్ని సమస్యాత్మక విషయాల విషయానికి వస్తే, కొంతమంది వాటిని అర్థం చేసుకుంటారు, మరికొందరు అర్థం చేసుకోరు. ఆయా ఆంశాలపై అవగాహన ఉన్నవారు, స్వయముగా అర్థం చేసుకోలేని వారికి వాటిని వివరించాలి." అందుకే అర్థం చేసుకోలేక పోతున్నారు. "లేదా వారు బహుశా వారి స్వంత పాపాల కారణంగా సర్వశక్తిమంతుడైన అల్లాహ్ అనుగ్రహాలను పొందడానికి వారి హృదయాలు సిద్ధంగా లేకపోవడం వల్ల కావచ్చు. "ఇలాంటి సమస్యాత్మక అంశాలు సాధారణంగా రెండు రకాలుగా ఉంటాయి. మొదటిది: అత్యంత సూక్ష్మ తత్వాలపై ఆధారపడినటు వంటి విజ్ఞానపరమైన ఆంశాలు. ఉదాహరణకు, దేవుని ఏకత్వభావన. దీనిలో కొంత భాగం అనగా దేవుడు ఒక్కడే అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోగలరు. కానీ దీనికి మించిన ఆధ్యాత్మిక ఆంశాలు అనగా దేవుని ఏకత్వం మనిషి యొక్క ప్రతి పనిపై ఎలా ప్రభావం చూపుతుంది అనే సూక్ష్మమైన దైవిక జ్ఞానంను తెలుసుకోవడం కోసం ఒక దైవజ్ఞాని అవసరం ఉంటుంది. ఇలాంటి ఆంశాలను ఇతరులకు నచ్చజెప్పడానికి ఒక ధర్మపండితుని ఆవశ్యకత చాలా అవసరం. ప్రతి వ్యక్తి ఇలాంటి సూక్ష్మమైన అంశాలను వెలికితీయలేడు. కానీ పవిత్ర ఖురాన్ ఏకేశ్వరుడిని మించి బోధించదని ఖచ్చితంగా అర్థం చేసుకుంటాడు. దేవుడు ఒక్కడే అని సర్వశక్తిమంతుడైన అల్లాహ్ పవిత్ర ఖురాన్‌లో పేర్కొన్నాడు.

"రెండవ సమస్య మేధోపరమైనది కాకపోయినా, రూపకం లేదా ఉపమానం అని పిలువబడే ప్రసంగ పద్ధతిలో వ్యక్తీకరించబడిన ఉన్నవి." ఇవి పాండిత్యానికి సంబంధించినవి కావు, కానీ ముఖ్యమైన పదబంధాలు మరియు ప్రకటనలకు సంబంధించినవి, వీటిని ప్రజలు అర్థం చేసుకోవడంలో విఫలమవుతారు. ఒకవేళ వాటిని ప్రజలకు చెబితే, వారిలో కొందరు అందుకు విరుద్ధంగా అర్థం చేసుకుంటారు. వారు (రజి) ఇలా తెలిపారు: "సగటు వ్యక్తి వాటి పట్ల అవగాహన లేకపోవడం వల్ల వాటి వాస్తవ అర్ధాలకు భిన్నముగా అర్థం చేసుకోగలదు. ఉదాహరణకు, (హజ్రత్ ముస్లేహ్-ఎ-మౌవూద్ రజి ఒక ఉదాహరణ ఇచ్చారు) దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జీవితంలో ఒక సంఘటన జరిగింది, సిరియా వైపు యుద్ధం చేయడం కోసం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ జైద్ బిన్ హరిస్ రజిను సైన్యాధ్యక్షుడిగా పంపుతూ, ఒకవేళ జైద్ రజి అమరుడైతే, హజ్రత్ జాఫర్ బిన్ అబీ తాలిబ్ రజి బాధ్యత వహించాలని, ఒకవేళ జాఫర్ రజి కూడా అమరుడైతే, అబ్దుల్లా బిన్ రవాహ రజి బాధ్యత వహించాలని సూచించారు. మొత్తానికి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తెల్పినట్లుగానే జరిగింది. వారు ముగ్గురూ, హజ్రత్ జైద్ రజి, హజ్రత్ జాఫర్ రజి, మరియు హజ్రత్ అబ్దుల్లాహ్ రజి లు అమరులయ్యారు. ఆ తరువాత, హజ్రత్ ఖలీద్ బిన్ వలీద్ రజి సైన్యాధ్యక్షుడి బాధ్యతలు స్వీకరించి సైన్యంను సురక్షితంగా తిసుక వచ్చాడు. వారి వీరమరణాల వార్త మదీనాకు చేరుకోగానే, భర్తలు మరణించిన భార్యలు మరియు ఈ యుద్ధంలో పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రులు షరియా నిబంధనలకు లోబడి ఏడ్చి దుఃఖం వ్యక్తం చేయడం ప్రారంభించారు. అయితే దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జాఫర్ రజి కోసం ఏడ్చేవారు ఎవరు లేరా? అని అన్నారు. ఇది కేవలం సంతాపాన్ని వ్యక్తం చేయడం కోసం మాత్రమే గాని, మహిళలను ఏకం చేసి ఏడిపించడం కోసం కాదు. " బంధువు కావున ప్రవక్త (స) తమ బాధను అలా వ్యక్త పరిచారు. హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి ఇలా తెలిపారు. నా దృష్టిలో ఈ వాక్యం యొక్క అర్థం జాఫర్ కొరకు ఎవరైన ఏడ్వండి అని ఏ మాత్రం కాదు. దీని అర్థం ఏమిటనగా చివరికి మా సోదరుడు కూడ ఈ యుద్ధంలో వీరమరణం పొందాడు. అయినా కూడ మేము ఏడ్వనప్పుడు మరి మీరు కూడ సహనంను పాటించాలి కదా!." ఈ విషయాన్ని ప్రవక్త (స) నచ్చజెప్పాలనుకున్నారు. " ఎందుకనగా అక్కడ హజ్రత్ జాఫర్ రజి గారి బంధువు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారు లేదా హజ్రత్ అలీ రజి మాత్రమే ఉన్నారు. వారి వైభవంతమైన స్థాయి వలన వారి నుండి ఎడ్పులు, పెడబొబ్బలు వెలువడలేవు. " దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అరిచేవారు కాదు, హజ్రత్ అలీ రజి కూడ అరిచేవారు కాదు. వారికి అవగహన ఉన్నది. సరైన పద్ధతి తెలుసు. నా సోదరుడు జాఫర్ రజి కూడ మృతి చెందాడు. కాని నేను ఏడ్వను అని తెలుపుటకే బహుశా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జాఫర్ రజి కోసం ఏడ్చేవారు ఎవరు లేరా? అని పలికారు. అన్సార్ ఈ మాటను వినగానే, వారికి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి ప్రతి మాటను నెరవేర్చే ఉత్సాహం ఉన్నందున, వారు తమ తమ ఇళ్ళకు పరుగెత్తి, వారి భార్యలతో ఇక్కడ ఏడ్వడం ఆపండి. జాఫర్ రజి ఇంటికి వెళ్ళి ఏడ్వండి అని అన్నారు. అందువలన మహిళలందరు జాఫర్ రజి ఇంటికి చేరుకోని ఏడ్వడం ప్రారంభించారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారి ఏడ్పులు విని ఏమి జరిగిందని అడిగారు. అప్పుడు సహచరులు 'ఓ అల్లాహ్ ప్రవక్త (స), జాఫర్ గురించి ఏడ్చుడానికి ఎవరూ లేరని మీరు ఇంతకు ముందు చెప్పిన దానికి, మేము మా స్త్రీలను హజ్రత్ జాఫర్ రజి ఇంటికి పంపాము మరియు వారు అక్కడ ఏడుస్తున్నారు" అని సమాధానమిచ్చారు. అందుకు ప్రవక్త (స) "నా ఉద్దేశం అదికాదు కదా!. ముందు వెళ్లి వారిని ఏడ్వకుండా ఆపండి.' అని అన్నారు. నా ఉద్దేశం ఏమిటనగా "మేము ఏడ్వడం లేదు కాబట్టి మీరందరూ కూడ ఓపికగా వ్యవహరించాలి." కాబట్టి, ఒక వ్యక్తి వెళ్లి వారిని ఆపమని చెప్పాడు. అందుకు ప్రతిస్పందనగా, ఆ స్త్రీలు, 'మమ్మల్ని ఆపడానికి మీరు ఎవరు? దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ రోజు "జాఫర్ గురించి ఏడవడానికి ఎవరూ లేరు" అని విచారం వ్యక్తం చేశారు. అయినా కూడ మీరు మమ్మల్ని ఆపడానికి వచ్చారా?' అని ప్రశ్నించారు. ఈ సమాధానం విన్న తర్వాత, ఆ వ్యక్తి మళ్ళీ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు చేరుకున్నాడు. ఎందుకనగా కొంతమంది చిన్న చిన్న విషయాలను కూడా ఇతరులకు తెలియ జేయడానికి అతిగా ఆసక్తి చూపుతారు," హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి ఇలా తెలిపారు. ఆ మహిళ ఇలా సమాధానం ఇవ్వగానే వెంటనే అతడు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిదికి చేరుకున్నాడు. ఆపై ఆ మహిళలు వినడం లేదని చెప్పాడు. " నా మాటను . " అందుకు ప్రవక్త (స) ఇలా అన్నారు, 'వారి తలలపై దుమ్ము వేయండి.' (ఇది ఒక రూపక వ్యక్తీకరణ), అంటే వారిని ఒంటరిగా వదిలేయండి. వారికి ఏమీ చెప్పకండి, వారు త్వరలోనే ఏడిచి ఏడిచి అలసిపోయి మౌనంగా ఉంటారు.""కానీ, అల్లాహ్ అతనిపై దయ చూపాలి, అతను తన దుప్పటిలో మట్టిని నింపుకున్నాడు. (అక్షరాలా అలా చేయడం ప్రారంభించాడు) మరియు దానిని స్త్రీల తలలపై పోయడం ప్రారంభించాడు. వారు, 'పిచ్చివాడా!' అని అరిచి, నీవు ఏం చేస్తున్నావు?' అని అడిగారు. అందుకు అతడు 'ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం మీ తలలపై మట్టి వేయమని ఆదేశించారు, కాబట్టి నేను ఖచ్చితంగా అలా చేస్తాను.' అని సమాధానం ఇచ్చాడు. నిజానికి ఇదొక ఉపమాన విషయం. కాని దీనిని కూడ అతడు అక్షరాల నెరవేర్చుటకు ప్రయత్నించాడు. "హజ్రత్ ఆయిషా రజి ఈ విషయం తెలుసుకున్నప్పుడు, ఆమె ఆ వ్యక్తిని మందలించి, 'నీకు దాని అసలు అర్థం అర్థం తెలియదు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారిని ఒంటరిగా వదిలివేయాలని, తగిన సమయంలో వారు తమంతట తాముగా మౌనం వహిస్తారని ఈ విధముగా తెలిపారు అంతేగాని నీవు అక్షరాల వారిపై మట్టి పోయాలని కాదు అని అన్నారు. ఇది దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం గారి ఉపమాన వాక్యము. అయినప్పటికీ అతడు అక్షరాలా మట్టి పోయడం ప్రారంభించాడు. కొన్నిసార్లు, ప్రజలు ఇలాంటి ఉపమానాలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడంలో విఫలమవుతారు. కాని ఇక్కడ చూడండి. ఒక వ్యక్తి అంతర్దృష్టి లేకపోవడం వల్ల అర్థం చేసుకోలేకపోయాడు, కానీ హజ్రత్ ఆయిషా రజి దానిని అర్థం చేసుకున్నారు. కొన్నిసార్లు, పదాలను వాటి వాస్తవికతకు వ్యతిరేకముగా అర్థం చేసుకుంటారు. అందువలన ఫలితం పూర్తిగా మారుతుంది."

**(ఫజాయిలుల్-ఖురాన్ (6), అన్వర్-ఉల్-ఉలుమ్, వాల్యూమ్. 14, పేజీలు. 351-353)**

ఈ సంఘటన ద్వారా సహచరులకు దైవ ప్రవక్త (స) పట్ల ఉన్న ప్రగాఢ ప్రేమను గూర్చి తెలుస్తుంది. హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ రజి ఈ సంఘటనను మరొక చోట ఈ విధముగా ప్రస్తావించారు . సహచరులు తమ మహిళలను హజ్రత్ జాఫర్ ఇంటికి ఏడ్వడానికి పంపడంను చూసినచో, ఈ ఘటన ద్వారా అనుచరుల హృదయాలలో దైవ ప్రవక్త (స) పట్ల ఉన్నటువంటి ప్రగాఢమైన ప్రేమ వ్యక్తమవుతుంది. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆ మాటాల ద్వారా ఏమి కోరుకుంటున్నారు అని ఆలోచించే అవకాశాన్ని కూడ ఆ ప్రేమ ఇవ్వలేదు. అందుకే వారు వెంటనే తమ స్త్రీల వద్దకు వెళ్ళి మీరు మీ దుఃఖాన్ని విడిచిపెట్టి, దైవ ప్రవక్త (స) దుఃఖంలో భాగస్వాములుకండి అని చెప్పారు. ఈ ఒక్క వాక్యము ద్వారనే వారి హృదయాలలో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పట్ల ఎంతటి ప్రేమ ఉన్నదో అర్థమవుతుంది. జాఫర్ ఇంటి నుండి ఎలాంటి ఏడుపులు వినిపించడం లేదు. దీనితో వారు ఊహించుకున్నదేమనగా, తమ బంధువుల మరణంపై ఏడ్చి తప్పు పని చేశాము. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు కల్గినటు వంటి

బాధయే అసలైన బాధ. హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి ఇలా తెలిపారు: ఇది ఒక కనిపించడానికి చిన్న సంఘటనయే కావచ్చును. కాని ప్రేమాభిమానాలను వ్యక్తపర్చునట్టి ఇలాంటి అద్భుత ఘట్టాలు బహుశా చాలా తక్కువగా కనిపిస్తుంటాయి. వీరు ఎంతటి గొప్పవారనగా, వీరి సేవలు దైవ ప్రవక్త (స) కళ్ళ ముందు నిలిచాయి. అంటే, వారి త్యాగాలను దైవ ప్రవక్త (స) చూశారు మరియు వారికి దైవ ప్రవక్త (స) పట్ల ఎంతో ప్రగాఢమైప ప్రేమ ఉంది. ఇలాంటి వాటికి ఉదాహరణలు ఏ ప్రాపంచిక సంబంధం కూడా మనకు కనిపించవు. కావున ఒకవేళ ప్రాపంచిక పరంగా చూసినచో, భవనల పరంగా చూసినచో, దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహిస్సలాం అనుచరుల పట్ల ఎక్కువ శ్రద్ధ చూపించి ఉండాల్సింది మరియు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు మన పట్ల ప్రేమ అనుచరుల కంటే చాలా తక్కువగా ఉండాలి . అనగా మనం ఈ కాలంలో, వారి తరువాత జన్మించిన వారి పట్ల, మన పట్ల తక్కువ ప్రేమ ఉండాల్సింది. ఎందుకంటే అనుచరులు ఎల్లప్పుడూ ప్రవక్త పట్ల తమ ప్రేమను వ్యక్తపరుస్తుండే వారు. పైగా ప్రవక్త (స) కళ్ళ ముందు ఉండేవారు. మరల ఇలా తెలిపారు. అయితే, దైవ ప్రవక్త (స) యొక్క అపరిమితమైన ప్రేమ. నిజానికి మానవ ప్రేమ ఎంత అపరిమితమైనది. కావున ఆ ప్రేమ మీ మనోధైర్యాన్ని చెదరనివ్వలేదు. అంటే, ఈ యుగంలో జన్మించిన మన ధైర్యాన్ని కూడా చెదరనివ్వలేదు. అదే విధముగా దైవ ప్రవక్త (స) ప్రేమ మధ్య తరం వారి మనోధైర్యాన్ని చెదురుటకు అనుమతించలేదు. కావున ఒక సందర్భంలో ఒక సమావేశంలో, ప్రవక్త (స) తమ తర్వాత వచ్చే వారిని గూర్చి ఇలా ఇచ్చరించారు. “నా సోదరులు – నా తర్వాత వచ్చే వారు – వారు ఇలాంటి స్వభావం కలిగి ఉంటారు ”సహాబాలు ఈ పదాలను విన్నప్పుడు, వారి హృదయాలలో అసూయ పుట్టింది. అందుకే వారు ఇలా విన్నవించుకున్నారు. “వారు మీ సోదరులా?, మేము కాదా? మేము మీ సహవాసంలోనే ఉన్నాము, అయినప్పటికీ మీరు మమ్మల్ని సోదరులుగా పేర్కొనలేదు. కాని తరువాత వచ్చే వారిని మీరు మీ సోదరులుగా పిలుస్తున్నారా?”. అందుకు దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు. “మీరు నా సహచరులు, వారు నా సోదరులు. మీరు నన్ను మీ కళ్ళతో చూస్తున్నారు, నా సమక్షంలో నాతో కలిసి ధార్మిక సేవ చేస్తున్నారు. ఇది ఏమైన తక్కువ భాగ్యమా?. ” మీకు లభించిన ఈ అవకాశం, మీకు ప్రసాదించబడిన గొప్ప వరం. వారు నన్ను చూడలేరు. తరువాత కాలంలో వస్తారు. కావున నా తరువాత వచ్చే వారి కోసం కొన్ని పదాలనైన పలుకనివ్వండి. వారిని గూర్చి కూడ కొన్ని పదాలను పలుకనివ్వండి. వారి మనస్సులు సంతృప్తి చెందుటకు, వారి మనోధైర్యంను దృఢపర్చుటకు నేను ఎలాంటి పదాలను పలుకవలెను. ఈ విధముగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తరువాత వచ్చేవారి మనోధైర్యాన్ని పెంచారు. కావున దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఏ విధముగా మీ ఆత్మస్థైర్యాన్ని పెంచారో చూడండి!. ప్రవక్త (స) ఇలా తెలిపారు. నా సమాజపు యొక్క మొదటి వర్గం ఉత్తమమైనదా? లేక చివరి వర్గం ఉత్తమమైనదా? అనే విషయం నాకు తెలియదు.

**(ఖుత్బాతే-షురా, వాల్యూమ్. 2, మజ్లిస్-ఎ-షురాలో ముగింపు ప్రసంగం 24 మార్చి 1940, పేజీలు 505-507)**

మౌతా యుద్ధపు అమరవీరుల గురించి మరిన్ని కథనాలు ఉన్నాయి. తన చారిత్రక రచన అల్-బిదాయహ్ వన్నిహాయహ్‌లో, అల్లామా ఇబ్న్ కసీర్ మౌతా యుద్ధపు అమరవీరుల గురించి ఇలా ప్రస్తావించారు. మౌతా యుద్ధంలో 12 వీరమరణం పొందారు. కొన్ని కథనాలు ఎక్కువ సంఖ్యను పేర్కొన్నప్పటికీ, రెండు సైన్యాలు ముఖాముఖిగా నిలబడటం అసాధారణమైన అద్భుతం – ఒకటి కేవలం 3,000 మంది సైనికులతో కలది మరియు అల్లాహ్ మార్గంలో పోరాడుతోంది. రెండవది. 1,00,000 మంది రోమన్ సైనికులు మరియు 1,00,000 మంది క్రైస్తవులతో కూడిన 200,000 మందిగల శత్రు సైన్యం. రెండు సైన్యాలు యుద్ధం చేశాయి. అయినప్పటికీ, పన్నెండు మంది ముస్లింలు మాత్రమే అమరవీరులయ్యారు – లేదా, చాలా తక్కువ సంఖ్యలో –వీరమరణం పొందారు. కాని అవిశ్వాసుల పెద్ద సమూహం నరకానికి పంపబడింది. ఆ రోజు, నా చేతిలో తొమ్మిది ఖడ్గాలు యుద్ధంలో విరిగిపోయాయి. కేవలం తన చేతుల్లో ఉన్న ఒకే ఒక యెమెన్ ఖడ్గము మాత్రమే యుద్ధ తీవ్రతను తట్టుకుంది. హజ్రత్ ఖాలిద్ రజి స్వయంగా పేర్కొన్నాడు. ఆ ఖడ్గాల దెబ్బతో ఎంతమంది అవిశ్వాసులు నరకానికి పంపబడ్డారో ఊహించవచ్చు.

మౌతా యుద్ధం నుండి ముస్లింలు మదీనాకు తిరిగి రావడం మరియు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారిని స్వాగతించడం గురించి ఇలా పేర్కొనడం జరిగింది. తిరిగి వచ్చేటప్పుడు, ముస్లిం సైన్యం ఒక కోట గల గ్రామం నుండి ప్రయాణించారు. ఈ మార్గం గుండా ముస్లిం మొదట వెళ్ళినప్పుడు, ముస్లింలలో ఒకరిని ఈ ప్రాంత నివాసులు హత్యచేశారు. అందువల్ల, ముస్లింలు దానిని ముట్టడించారు. చివరికి జయించారు. మరియు హజ్రత్ ఖలీద్ రజి వారి నాయకులను చంపారు. మౌతా నుండి ముస్లిం సైన్యం తిరిగి వచ్చినప్పుడు, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం, అనేక మంది సహచరులతో కలిసి వారిని స్వాగతించారు. కానీ వారు తిరిగి వచ్చినప్పుడు, కొంతమంది వ్యక్తులు వారిపట్ల “ వీరు ఎందుకు అమరులు కాకుండా తిరిగి వచ్చారు. అసలు ఇది విజయమే కాదు ” అని కోపగించుకున్నారు. సాధించలేదని పేర్కొన్నారు. కొందరు సైనికులపై దుమ్ము పోసి, “ఓ అల్లాహ్ మార్గం నుండి పారిపోయిన వారలారా!” మీరు అల్లాహ్ మార్గం నుండి పారిపోయి వచ్చారా?.అని ఎగతాళి చేశారు. అందుకు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు: “వారు పారిపోలేదు. వారు మళ్ళీ పోరాడటానికి తిరిగి వెళ్ళుతారు.”

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ రజి ఇలా ఉల్లేఖించారు. ముస్లిం సైన్యం మౌతా నుండి తిరిగి వచ్చినప్పుడు, నేను కూడా వారితో తిరిగి వచ్చాను. మరొక కథనంలో, ఆయన ఇలా పేర్కొన్నాడు: “మేము సిగ్గుపడ్డాము. ఎందుకనగా పారిపోయి వచ్చామని మేము భావించాము. మేము యుద్ధభూమిని విడిచిపెట్టినట్లు మాకు అనిపించింది.” నిజానికి శత్రువులు తమంతట తాముగా ఆ ప్రదేశం నుండి వెనక్కి వెళ్ళిపోయారు. ముస్లింలు వారిని వెంబడించలేదు. వారు అట్టి అవకాశాన్ని అదృష్టముగా భావించారు. కావున తిరిగి వచ్చారు. ఇలా వ్యూహాత్మక నిర్ణయాన్ని తీసుకున్నారు, ఇది తెలివైనది అయినప్పటికీ, కొంతమంది దీనిని పారిపోయి రావడం అని తప్పుగా అర్థం చేసుకున్నారు. అందువలన మేము పారిపోయి వచ్చామా అని భావించి సిగ్గుపడ్డాము. ఒక అనుచరుడు ఇలా తెలిపారు. ఒకవేళ తాము మదీనాకు తిరిగి వస్తే, తమకు మరణశిక్ష విధించబడవచ్చని భావించి, రాత్రిపూట మదీనాలోకి ప్రవేశించి దాక్కున్నాము. కొందరు రాత్రిపూట నగరంలోకి ప్రవేశించి, దాక్కున్నారు. మరల ఇలా తెలిపారు. అయినప్పటికీ, తాము దైవ ప్రవక్త (స) ముందు కనిపించి క్షమాపణ కోరాలని కోరుకున్నారు. ఒకవేళ క్షమించబడితే, శాంతితో ఉంటాము, లేకుంటే, తిరిగి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నాము. అనగా యుద్ధంలో పాల్గొనుటకు బయలుదేరుతాము. లేదా అక్కడి నుండి వెళ్ళిపోతాము. ఫజర్ నమాజ్‌కు మేము దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హాజరయ్యాము. మీరు ఎవరు అని ప్రవక్త (స) అడిగారు. అందుకు మేము సిగ్గుతో, “మేము పారిపోయిన వారిమే” అని సమాధానం ఇచ్చాము. వారు సిగ్గుపడ్డారు. అందుకే పారిపోయి వచ్చామని అంగీకరించారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం వారిని సరిదిద్దుతూ, “కాదు, మీరు తిరిగి శత్రువుపై దాడి చేయువారు. అని అన్నారు. మరొక కథనం ప్రకారం, “నేను నీ వర్గీయులలో ఒకడిని. లేదా ఇలా అన్నారు. నేను ప్రతి ముస్లిం వర్గానికి చెందినవాడను ”. అప్పుడు మేము ప్రవక్త (స) చేతులను ముద్దు పెట్టుకున్నాము.

**(సుబులుల్-హుదా వర్రిషాద్ వాల్యూమ్. 6, దారుల్-కుతుబుల్ ఇల్మియా, బీరుట్, పేజీలు 154-156) (ఘజ్వాన్నబి (స) అబుల్ కలాం ఆజాద్, సిటీ బుక్ పాయింట్, కరాచీ, పేజీలు 177)**

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చాలా దయను ప్రదర్శించారు.

మరొక యుద్ధ ప్రస్తావన గలదు. దీనిని హజ్రత్ అమర్ బిన్ ఆస్ రజి యుద్ధం అని పిలుస్తారు. ఈ యుద్ధం హిజ్రి 8వ సం॥ జమాదిఉస్సాని లో జరిగింది. ఈ యుద్ధం హిజ్రి 7 వ సం॥లో జరిగినట్లుగా కూడ చెబుతుంటారు. ఈ యుద్ధం మౌతా యుద్ధం తరువాతే జరిగిందని ఇబ్నే అస్‌హాఖ్ తప్ప మిగిలిన వారందరు ఏకాభిప్రాయాన్ని కల్గియున్నారు. ఈ మౌతా యుద్ధం హిజ్రి 8 వ సం॥లో జమాదిఉల్ అవ్వల్‌లో జరిగింది.

ఈ యుద్ధానికి గల కారణం ఇలా గలదు. మదీనాపై దాడి చేయుటకు బనూ ఖుజాఅకు చెందిన వారు సైన్యాన్ని సమీకరిస్తున్నారని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు సమాచారం అందింది. ఈ ఖుజాఅ తెగవారు ఖహ్‌తానీయుల వర్గానికి చెందినవారు. పైగా వీరు మదీనా నుండి 10 రోజుల ప్రయాణ దూరంలో ఉన్నటు వంటి ఖురా లోతట్టు ప్రాంతం ముందు నివాసం ఉంటున్నారు.

ఈ యుద్ధమును గూర్చిన మరిన్ని వివరాలు ఇలా గలవు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారిని అడ్డుకోవడం కోసం హజ్రత్ అమర్ బిన్ ఆస్ రజిను పంపారు. హజ్రత్ అమర్ బిన్ ఆస్ రజి మక్కాకు చెందిన నాయకుడైన ఆస్ బిన్ వాఇల్ కుమారుడు. వీరు హిజ్రి 7 లేదా మరికొన్ని కథనాల ప్రకారం హిజ్రి 8వ సం॥లో ఇస్లాంను స్వీకరించారు.

హజ్రత్ అమర్ రజి ఇలా తెలిపారు. నేను నా దుస్తువులను, ఆయుధాలను సిద్ధము చేసుకోవాలని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నాకు ఒక సందేశాన్ని పంపారు. ఆ తరువాత ఇలా అన్నారు. ఓ అమర్ ! నేను నిన్ను ఒక సైన్యానికి సేనాధిపతిగా నియమించి, పంపాలనుకుంటున్నాను. అల్లాహ్ తాలా మీకు యుద్ధ సంపదను అనుగ్రహించును, మిమ్ములను రక్షించును కూడ. హజ్రత్ అమర్ రజి ఇలా విన్నవించుకున్నారు. నేను సంపద కోసం ఇస్లాంను స్వీకరించలేదు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు. పుణ్యాత్ములకు ధర్మబద్ధమైన సంపద ఎంతో బాగుంటుంది. నీవు కోరుకోవడం లేదు. కాని అల్లాహ్ తాలా

అనుగ్రహించినచో చాలా బాగుంటుంది. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హ'జ్రత్ అమర్ రజి నాయకత్వంలో ముహాజిర్లు మరియు అన్సార్లను కలిపి 300ల మందితో సైన్యాన్ని ఏర్పాటు చేశారు. వారిలో 30 మంది అశ్వదళ సైనికులు కూడ ఉన్నారు. ప్రవక్త (స) హ'జ్రత్ అమర్ రజి కోసం ఒక తెల్లటి పతాకమును ఏర్పాటు చేశారు. తోడుగా మరొక నలుపు రంగు పతాకమును కూడ ఇచ్చారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హ'జ్రత్ అమర్ రజికు " మార్గ మధ్యలో బనూ బల్లి, ఉజ్‌రఅ, బల్‌ఖీన్ తెగలవారు ఎవరు కలిసిన వారిని కూడ మీతో తీసుకవెళ్ళుటకు ప్రయత్నించుము " అని హితోపదేశం చేశారు.

హ'జ్రత్ అమర్ రజి యుద్ధంలో ప్రత్యేక నైపుణ్యాన్ని కల్గియుండేవారు. యుద్ధ వ్యూహం పట్ల కూడ చాలా అనుభం కల్గినవారు. వారికి ఉన్నటు వంటి యుద్ధ నేర్పు వలనే దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారిని సైనాధిపతిగా నియమించారు.

**(షరా జర్కాని అలల్ మవాహిబ్, అల దునియా, సంపుటి 3, పేజి 357–359, 361, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్) (ఉసదుల్ ఘాబా, సంపుటి 4, పేజి 232, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)(ఫ్రాంగ్ సీరత్, పేజి 237, ఖుజాఅ పదం బందం)**

హ'జ్రత్ అమర్ రజిను ఈ యుద్ధానికి పంపడానికి గల మరొక కారణం ఏమిటనగా, వారి నాయనమ్మ (దాది) బల్లీ తెగకు చెందిన వంశానికే చెందినవారు. కావున బల్లీ తెగవారితో సత్సంబంధాలను కొనసాగించుటకు వీరు ఒక మంచి మాధ్యమంగా ఉన్నారు.

**(సీరత్ ఇబ్నే హిష్షామ్, పేజి 879, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)**

ఇస్లామీయై సైన్యం బయలుదేరింది. ఈ సైన్యం రాత్రివేళ ప్రయాణించేది. పగలు దాకున్నేది. ఇలా ప్రయాణిస్తూనే ఈ సైన్యం జుజామ్ అనే ప్రాంతంలో ఉన్నటు వంటి సలాసిల్ అనే పేరుగల ఒక చెలిమ వద్దకు చేరుకున్నది. ఆ చెలిమ కారణంగానే ఈ యుద్ధానికి జాతే సలాసిల్ అని నామకరణం చేయబడింది.

(సుబూలుల్ హుదా వర్రిషాద్, సంపుటి 6, పేజి 167, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)

మదీనా నుండి ఇంకా ఎక్కువ సైన్యంను పంపమని కోరిన ప్రస్తావన కూడ గలదు. ఆ చెలిమ వద్దకు చేరుకున్న తరువాత శత్రువు సైన్యం చాలా ఎక్కువ సంఖ్యలో ఉన్నదనే విషయం ముసల్మానులకు తెలిసింది. కావున హ'జ్రత్ అమర్ రజి సైనిక సహాయం కోసం హ'జ్రత్ రాఫిఅ బిన్ మకీస్ రజిను దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిదికి పంపారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హ'జ్రత్ అబూ ఉబైదహ్ బిన్ జర్రా రజి కొరకు ఒక జండాను సిద్ధం చేశారు. ఆపై ముహాజిర్ మరియు అన్సార్‌లతో కూడిన 200ల మంది సైన్యంతో వారిని పంపారు. హ'జ్రత్ అబూబకర్ రజి మరియు హ'జ్రత్ ఉమర్ రజిలు కూడ వారిలో ఉన్నారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హ'జ్రత్ అబూ ఉబైదహ్ రజిను పంపుచున్నప్పుడు ఇలా ఉపదేశించారు. మీరు అక్కడికి చేరుకున్న తరువాత హ'జ్రత్ అమర్ రజి సైన్యంలో కలిసి పోండి. ఒకే సైన్యంగా మారండి. పరస్పరం విభేదించుకోకండి. దీని అర్థం ఇరువురు ఏకాభిప్రాయంతో వ్యవహరించండి. బేధాలు రాకూడదు. హ'జ్రత్ అమర్ రజియే సైనాధిపతిగా కొనసాగుతాడు.

వివరణలో ఈ విధముగా పేర్కొనబడడం జరిగింది. ఒక సందర్భములో ముసల్మానులు తమను తాము చలి నుండి కాపాడుకోవడం కోసం, వేడి తాపడం కోసం మంట రాజేయడం కోసం కర్రలను ప్రోగు చేశారు. కాని హ'జ్రత్ అమర్ రజి అలా చేయకూడదని చెప్పారు. మరొక కథనములో హ'జ్రత్ అమర్ రజి మంటను రాజేయకండి అని చెప్పినప్పుడు హ'జ్రత్ ఉమర్ రజికు కోపం వచ్చింది. వారి వద్దకు వెళ్ళాలనుకున్నారు. కాని హ'జ్రత్ అబూబకర్ రజి వద్దని ఆపారు. ఆపై వారికి గల యుద్ధ వ్యూహం వలనే వారిని దైవ ప్రవక్త సల్లల్లహు అలైహి వసల్లం సైన్యాధిపతిగా నియమించారని చెప్పారు.

**(షరా జర్కాని అలల్ మవాహిబ్ లిల్ దునియా, సంపుటి 3, పేజి 359–361, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)(సుబూలుల్ హుదా వర్రిషాద్ సంపుటి 6, పేజి 168, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)**

హ'జ్రత్ అమర్ రజి మదీనాకు తిరిగి వచ్చిన తరువాత దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో " శత్రువుల మన తక్కువ సంఖ్యను చూసి, వారు ఎక్కువ సైన్యాన్ని ఏర్పాటు చేసుకోని మనపై ఎక్కడ దాడి చేస్తారో అనే ఉద్దేశంతోనే నేను మంటలు రాజేయకూడదని అడ్డుకున్నాను " అని విన్నవించుకున్నారు. అందుకు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారిని అభినందించారు.

**(సీరతుల్ హలబియ్యా సంపుటి 3, పేజి 269, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)**

మొత్తానికి వివరాలలో ఈ విధముగా గలదు. ముసల్మానులు ఆ ప్రాంతం నుండి బయలుదేరి శత్రువులు ఉన్న చోటుకు చేరుకున్నారు. వారితో పోరాడినారు. విజయాన్ని సాధించారు. నిజానికి ముసల్మానులు శత్రువులు ఏకమవుతున్న ప్రాంతానికి చేరుకునే సమయానికి శత్రువులు ముసల్మానుల రాకను గూర్చి తెలుసుకోని పారిపోయారు. నలువైపులకు చెల్లాచెదురైనారు. ముసల్మానులు వారిని వెంబడించగా, కొద్దిపాటి ఒక శత్రువు సైన్యం దాడికి పాల్పడింది. అప్పుడు ముసల్మానులు వారితో పోరాడి వారిని ఓడించారు. మిగిలిన శత్రువులు పారిపోయారు. ముసల్మానులు కొన్ని రోజుల వరకు అక్కడే ఉన్నారు. ఎక్కడ శత్రువు మూకలున్నాయని తెలిసిన కూడ అక్కడికి అశ్వదళంను పంపేవారు. వారు శత్రువులతో పోరాడి, ఓడించి వారి మేకలను, ఒంటెలను యుద్ధ సంపదగా తీసుకవచ్చేవారు. కొన్ని రోజుల తరువాత ముసల్మానలు మదీనాకు తిరిగి బయలుదేరినారు. హ'జ్రత్ అమర్ రజి, యుద్ధ పరిస్థితులను గూర్చి, క్షేమముగా ఉండడం, తిరిగి రావడంను గూర్చి దైవ ప్రవక్త (స)కు సమాచారం అందించడం కోసం హ'జ్రత్ ఔఫ్ బిన్ మాలిక్ అష్జఅ రజిను దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు ముందుగా పంపారు. **(సుబూలుల్ హుదా వర్రిషాద్, సంపుటి 6, పేజి 168, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)**

ప్రస్తావించబడిన మరొక యుద్ధం పేరు హ'జ్రత్ అబూ ఉబైదా బిన్ జర్రహ్ రజి. ఈ యుద్ధం హిజ్రి 8వ సం" రజబ్ మాసంలో జరిగింది. హ'జ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ రజి ఎం.ఏ గారు తన పుస్తకం చివరలో, ప్రతిపాదిత విషయాల జాబితాను రూపొందించారు. అందులో వారు రజి ఈ యుద్ధం హిజ్రి 8వ సం॥ రజబ్ మాసంలో అనగా నవంబర్ క్రీ॥ శ॥ 629లో జరిగింది అని పేర్కొన్నారు.

**(సీరత్ ఖాతమున్నబియ్యీన్ సల్లల్లాహు అలైహి వసల్లం , హ'జ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ రజి. పేజి 840)**

ఈ యుద్ధానికి ప్రత్యామ్నాయ పేర్లు కూడా ఉన్నాయి: దీనిని సిఫుల్–బహార్ యుద్ధం మరియు ఖబత్ యుద్ధం అని కూడా పిలుస్తారు. సిఫుల్–బహార్ అంటే సముద్ర తీరం. సహచరులు ఎర్ర సముద్రం ఒడ్డున తమ శిబిరాన్ని ఏర్పాటు చేసుకున్నందున, ఈ యుద్ధాన్ని సిఫుల్–బహార్ యుద్ధం అని పిలుస్తారు. దీనిని ఖబత్ యుద్ధం అని పిలుస్తారు, అంటే ఆకులు తినే సైన్యం, ఎందుకంటే ఈ యాత్రలో ఒక సమయంలో, సహచరులు ఆకులను మాత్రమే తినవలసి వచ్చింది.

ఈ యుద్ధానికి హ'జ్రత్ అబూ ఉబైదా బిన్ జర్రహ్ రజి నాయకత్వం వహించారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారిని 300 మంది ముహాజిరీన్ మరియు అన్సార్ల సైన్యంతో పాటు బను జుహైనా తెగవైపు పంపారు. హ'జ్రత్ ఉమర్ రజి కూడా ఈ సైన్యంలో పాల్గొన్నారు. బను జుహైనా ఖబలియా అనే ప్రదేశంలో నివసించేవారు. ఖబలియాహ్ మదీనా నుండి సముద్ర తీరం వెంబడి ఐదు రాత్రుల ప్రయాణం దూరంలో ఉంది. ఈ యుద్ధానికి గల కారణం ఏమిటంటే, మక్కాకు చెందిన ఒక ఖురైష్ సమూహం ధాన్యంను తీసుకోని సిరియా నుండి మక్కా వైపు సముద్ర తీరం వెంబడి ప్రయాణిస్తుండగా, జుహైనా నుండి వచ్చిన ఒక తెగ వారిపై దాడి చేసే ప్రమాదం ఉందని తెలిసింది. అది హుదైబియా ఒప్పంద సమయం. పైగా జుహైనా తెగవారు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మిత్రులు కాబట్టి, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చాలా వివేకంతో వ్యవహరించి, సిరియా నుండి వస్తున్న వ్యాపార బృందంపై ఎలాంటి దాడి జరుగకూడదని, శాంతి ఒప్పందం ఉల్లంఘించబడిందని ఖురైష్‌లు సాకు చూపే అవకాశాన్ని కల్పించకూడదని, ముందుజాగ్రత్తగా భద్రతా దళాన్ని పంపారు. హుదైబియా ఒప్పందం అమలులో ఉన్నందున దారిలో అక్కడ నివసిస్తున్న తెగ వారిపై దాడి జరుగకుండా ఉండటానికి, వారికి రక్షణ కల్పించడానికి పంపారు. వారిని కాపాడడం కూడ బాధ్యతయే. పైగా ప్రవక్త (స) ఒప్పందానికి కట్టుబడి ఉంటారు కావున ప్రవక్త (స) వారిని రక్షించడానికి 300 మంది సైనికులతో కూడిన ఒక దళాన్ని పంపారు. తద్వారా ఖురైష్‌ల బృందం సురక్షితంగా అక్కడి నుండి వెళ్ళగలరు. సహచరులు ఎవరితోనూ పోరాడటానికి బయలుదేరలేదని ఇది స్పష్టంగా చూపిస్తుంది. అందువల్ల, పదిహేను రోజుల కంటే ఎక్కువ కాలం బస చేసినప్పటికి ఎటువంటి పోరాటం జరిగిన ప్రస్తావన లేదు. **(సుబులుల్–హుదా వర్రిషాద్, వాల్యూమ్. 6, పేజీ 176, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)(బుఖారి, సంపుటి 9, పేజి 239, ప్రచురణ నజారత్ ఇషాఅత్ )** ఈ

ఈ యుద్ధానికి బయలుదేరడం మరియు సామగ్రి అయిపోవడం గురించి వివరాలు ఈ క్రింది విధంగా ప్రస్తావించబడ్డాయి: హ'జ్రత్ జాబిర్ రజి ఈ యుద్ధాన్ని గూర్చి ఇలా పేర్కొన్నారు, "ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మమ్మల్ని పంపించారు. మేము మూడు వందల మంది సైనికులం. మాకు నాయకుడు హ'జ్రత్ అబూ ఉబైదా బిన్ జర్రహ్ రజి. మేము బయలుదేరి కొద్ది దూరం మాత్రమే ప్రయాణించిన తర్వాత మా సామాగ్రి అయిపోయింది. హ'జ్రత్ అబూ ఉబైదహ్ రజి మొత్తం భోజన సామాగ్రిని సేకరించాలని, మీ దగ్గర ఉన్న ఆహార నిల్వను తీసుకురావాలని ఆదేశించారు. అందువల్ల, అది సేకరించబడింది. తీర చూస్తే రెండు బస్తాల ఖర్జూరంలు ప్రోగైనాయి. హ'జ్రత్ అబూ ఉబైదహ్ రజి ప్రతిరోజూ మాకు తినడానికి

కొంచెం ఇచ్చేవారు, అది కూడా అయిపోయింది. అప్పుడు మాకు ఒక్కొక్కరికి ఒకే ఖర్జూరం వచ్చేది." కథకుడు ఇలా తెలిపాడు, "నేను హజ్రత్ జాబిర్ రజిను 'ఒక ఖర్జూరం మీ ఆకలిని తీరుస్తుందా?' అని అడిగాను. అందుకు వారు 'మా దగ్గర అది కూడా లేనప్పుడు, ఒక్క ఖర్జూరం కూడా లేదని మేము చింతించేవారము." అని సమాధానం ఇచ్చారు. మా దగ్గర ఏమీ మిగలనప్పుడు, మాకు ఆ ఒక్క ఖర్జూరం విలువ తెలిసి వచ్చింది. మరొక కథనం ప్రకారం, హజ్రత్ జాబిర్ రజి ఇలా అన్నారు, "మేము రోజంతా ఒకే ఖర్జూరం తినేవారము. ఆపై మేము నీరు తాగుతాము. ఇది రాత్రి వరకు మాకు సరిపోతుంది."

హజ్రత్ జాబిర్ రజి ఇలా అన్నారు, "ఖురైష్ బృందాన్ని రక్షించడానికి మేము దానికి కాపలాగా కూర్చున్నాము. మేము సముద్ర తీరం వెంబడి సగం నెల గడిపాము. మాకు విపరీతమైన ఆకలి కల్గింది. అందువలన మేము ఆకులు కూడా తిన్నాము. అందుకే ఈ సైన్యాన్ని జైష్ అల్-ఖబ్త్ అని పిలుస్తారు, అంటే ఆకులు తినే సైన్యం. ఇలా తెలిపారు. "ఈ ఆహారం కారణంగా మేము బలహీన పడ్డాము మరియు మా పెదవులు మరియు మా నోటి చుట్టూ ఉన్న ప్రాంతం గాయపడింది, చివరికి ఒక వ్యక్తి ఇలా అన్నాడు. ఈ స్థితిలో మనం శత్రువులతో పోరాడవలసి వచ్చినచో, మనం ఎదుర్కొంటున ఈ కష్టం వలన ఏ విధముగా కూడ చలించలేని స్థితిలో ఉండేవారము. అనగా పోరాడే పరిస్థితి లేకుండెను.

ఆహారం కోసం ఒంటెలను బలి ఇచ్చినట్లు కూడా ఒక సందర్భంలో ప్రస్తావించబడింది. హజ్రత్ జాబిర్ రజి ఇలా అన్నారు. సైన్యంలో ఒక వ్యక్తి ఉన్నాడు. అతడు ప్రజల ఆహారం కోసం మూడు రోజుల్లో మూడు మూడు ఒంటెలను వధించేవాడు. "అప్పుడు, హజ్రత్ అబూ ఉబైదహ్ రజి అతన్ని ఆపారు."

**(సుబులుల్-హుదా వర్రిషాద్, వాల్యూమ్. 6, దారుల్ కుతుబుల్ ఇల్మియా, బీరూట్, పేజీ. 176) (సహీ బుఖారీ, కితాబ్ అల్-మఘాజీ, బాబ్ ఘజ్వతి సిఫ్ అల్-బహర్, హదీసులు 4360-4362)(సహీ-బుఖారీ, కితాబుల్-షిర్కా, బాబ్ షిత్తాఅమ్, హదీసులు 2483)**

అన్ని చరిత్ర పుస్తకాల ద్వారా ఆ వ్యక్తి హజ్రత్ ఖైస్ బిన్ సఅద్ రజి అని తెలుస్తుంది. హజ్రత్ ఖైస్ బిన్ సఅద్ ఇలా అన్నారు, "ఒంటెకు బదులుగా నా నుండి ఎవరు ఖర్జూరంలు కొంటారు?. నేను ఒంటెను ఇక్కడే వధిస్తాను, కాని నేను దాని విక్రయ నగదును మదీనాలో అందిస్తాను." మరో మాటలో చెప్పాలంటే, సహచరుల ఆకలిని చూసి, అందరికీ ఆహారం ఏర్పాటు చేయడానికి తాను ఒక ఒంటెను కొని అక్కడ బలి ఇస్తానని చెప్పాడు. హజ్రత్ ఉమర్ రజి అక్కడ ఉన్నారు వారు రజి ఇలా అన్నారు. "ఈ బాలుడిని చూసినచో ఆశ్చర్యమేస్తుంది. ఎందుకంటే అతని వద్ద ఎటువంటి సంపద లేదు, అయినప్పటికీ అతను ఇతరుల సంపదను ఖర్చు చేయుటకు సిద్ధముగా ఉన్నాడు. ఇంటికి తిరిగి వెళ్ళినచో అతను ఈ మొత్తం నగదును ఎలా చెల్లించగలడు? అతనికి సొంత తోట లేదు." హజ్రత్ ఖైస్‌కు జుహైనా నుండి వచ్చిన ఒక వ్యక్తి కలిశాడు. ఖైస్ అతనితో "నాకు ఒంటెను అమ్ము" అని అడిగాడు. ఆ తరువాత వారు రజి అక్కడి తెగ వారినుండి ఒంటెలను కొన్నాడు, మదీనాకు వెళ్ళిన తర్వాత ఆ మొత్తాన్ని ఖర్జూరం రూపంలో ఇస్తానని చెప్పాడు. ఆ వ్యక్తి, "నువ్వు ఎవరో కూడా నాకు తెలియదు" అని అన్నాడు. హజ్రత్ ఖైస్ రజి "నేను ఖైస్ బిన్ సాద్ బిన్ ఉబాద" అని అన్నారు. ఆ వ్యక్తి, "నీ కుటుంబ నేపథ్యాన్ని పరిచయం చేసుకోవడం ద్వారా నువ్వు నిన్ను బాగా పరిచయం చేసుకున్నావు.నాకు మరియు మస్రబ్ అధిపతి అయినా సఅద్ తో స్నేహం ఉన్నది. మేమిద్దరం స్నేహితులం." అని అన్నాడు. హజ్రత్ ఖైస్ రజి ఐదు ఒంటెలను ఐదు కుప్పల ఖర్జూరానికి కొన్నాడు, అంటే దాదాపు 750 కిలోల ఖర్జూరానికి సమానం. హామీదారులు ఉండాలి కాబట్టి అతనికి సాక్షులుగా ఉండమని ఆయన అన్నారు. అందుకు ముహాజిరీన్ మరియు అన్సార్ల నుండి కొంతమంది సహచరులు వారికి సాక్షులుగా నిలిచారు. హజ్రత్ ఉమర్ రజి సాక్షిగా ఉండటానికి నిరాకరించారు. ఎందుకనగా, ఖైస్ ఖర్జూరంలు ఇస్తానని అంటున్నాడు. ఆ సంపద అతనిది కాదు, అతని తండ్రిది. అతడు ఖర్జూర తోటల గురించి మాట్లాడాడు. నిజానికి ఖర్జూర తోటలు అతని తండ్రికి చెందినవి, కాబట్టి అతను వాటిని ఎలా ఇవ్వగలడు?. మొత్తానికి ఈ సైన్యం మదీనాకు తిరిగి వచ్చినప్పుడు, హజ్రత్ సఅద్ రజి హజ్రత్ ఖైస్ రజిను "అనుచరులు ఆకలితో ఉన్నప్పుడు నీవు ఏమి చేసావు?" అని అడిగాడు. అందుకు ఖైస్ రజి "నేను ఒక ఒంటెను బలి ఇచ్చాను." అని సమాధానం ఇచ్చాడు. హజ్రత్ సఅద్ రజి " ఆ తరువాత మళ్ళీ ఏమి చేశావు? అని అడిగాడు. హజ్రత్ ఖైస్ రజి "నేను మరొక ఒంటెను బలి ఇచ్చాను" అని అన్నాడు. హజ్రత్ సఅద్ రజి, "ఆ తరువాత మళ్ళీ ఏమి చేశావు? అని అడిగాడు. హజ్రత్ ఖైస్ రజి "నేను మరొక ఒంటెను బలి ఇచ్చాను" అని అన్నాడు. హజ్రత్ సఅద్ రజి " ఆ తరువాత మళ్ళీ ఏమి చేశావు?" అని అడిగాడు. హజ్రత్ ఖైస్ రజి ఇలా అన్నారు, "అప్పుడు నన్ను ఆపమని చెప్పారు." హజ్రత్ సఅద్ రజి "నిన్ను ఎవరు ఆపారు?" అని అడిగారు. హజ్రత్ ఖైస్ రజి, హజ్రత్ అబూ ఉబైదహ్ రజి నన్ను ఆపారు అని అన్నారు. ఆ తరువాత సఅద్ రజి "అతను నిన్ను ఎందుకు ఆపాడు?" అని ఖైస్‌ను అడిగారు. హజ్రత్ ఖైస్ రజి ఇలా సమాధానం ఇచ్చారు. " వారు రజి నా దగ్గర ఎటువంటి సంపద లేదని అన్నారు. పైగా ఆ తోటలు నీ తండ్రివి అని అన్నారు." హజ్రత్ సఅద్ రజి ఇలా అన్నారు, "నేను నీకు నాలుగు తోటలు ఇస్తాను." దీనితో, ఖైస్ తండ్రి సంతోషించాడు. అందుకే ఇలా అన్నారు, "నేను నీకు నాలుగు తోటలు ఇస్తాను. వాటిలో అతి తక్కువైనది మీకు యాభై కుప్పల ఖర్జూరపు దిగుబడినిస్తుంది." అది కొన్ని వందల కిలోల ఖర్జూరంలు. హజ్రత్ సఅద్ రజి దానిని వ్రాతపూర్వకంగా రాశారు మరియు హజ్రత్ అబూ ఉబైదహ్ రజి, ఇతరులతో పాటు సాక్షులుగా ఉన్నారు. బనూ జుహైనా నుండి వచ్చిన ఆ వ్యక్తి కూడా హజ్రత్ ఖైస్ రజితో పాటు మదీనాకు వచ్చాడు. హజ్రత్ సఅద్ రజి ఆయనకు ఖర్జూరంలను, గుర్రపు స్వారీ జంతువును ఇచ్చి, ధరించడానికి బట్టలు ఇచ్చాడు. హజ్రత్ జాబిర్ రజి ఇలా తెలిపారు. ఈ వార్త దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు చేరినప్పుడు, ప్రవక్త (స) ఇలా అన్నారు. "ఉదారత వారి కుటుంబ స్వభావంలో భాగమైంది." **(సుబులుల్-హుదా వర్రిషాద్, వాల్యూమ్. 6, దారుల్ కుతుబుల్ ఇల్మియా, బీరుట్, పేజీలు 177-178) (లుగతుల్-హదీస్, వాల్యూమ్. 2, పేజి 648, వాల్యూమ్. 4, పేజీలు 487)**

హజ్రత్ సయ్యద్ జైనుల్ అబిదిన్ వలియుల్లా షా సాహిబ్ రజి ఈ సంఘటన గురించి వివరిస్తూ ఇలా పేర్కొన్నారు. " అనుచరుల బృంధం తీవ్రమైన ఆకలి, దప్పికల సమయంలో అత్యంత ఓర్పుతో వ్యవహరించడం, ఏ బృందంతో, ఏ నగర వాసులతో పోరాటం చేయక పోవడం అనేది పైన పేర్కొనబడిన ఘటనకు ఎలాంటి యుద్ధంతో సంబంధం లేదని రుజువు చేస్తుంది, లేదా వారి స్వచ్ఛమైన ఆత్మలు నిరంకుశత్వాన్ని అనుమతించలేదని భావించాయి."

**(సహీ-బుఖారీ, వాల్యూమ్. 9, నజరత్ ఇషాత్, పేజీ. 240)**

మొత్తానికి ఆ సమయంలో వారి ఆకలిని తీర్చడానికి సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఒక మార్గాన్ని కూడా సృష్టించాడు. ఈ విషయంలో, హజ్రత్ జాబిర్ రజి ఈ యుద్ధంను గురించి మరిన్ని వివరాలను ఇలా ప్రస్తావించారు. ఆయన స్వయంగా ఇలా పేర్కొన్నాడు, "సముద్రం మా కోసం అన్బర్ అనే చిన్న పర్వతం పరిమాణంలో ఉన్న చేపను విసిరింది." అన్బర్ ఒక పెద్ద చేపను సూచిస్తుంది, దీనిని తిమింగలం అని పిలుస్తారు. అల్లామా అజారీ ఇలా పేర్కొన్నాడు: "అన్బర్ చాలా పెద్ద తిమింగలం మరియు దాని పొడవు 50 గజాల వరకు ఉంటుంది." హజ్రత్ జాబిర్ రజి ఇలా తెలిపారు. మేము దాని మాంసాన్ని సగం నెల వరకు తిన్నాము. మరొక కథనం ప్రకారం, 18 రోజులు లేదా ఒక నెల మొత్తం తిన్నాము. అక్కడ ఉన్నన్ని రోజులు, తిరిగి వచ్చే వరకు దాని మాంసాన్ని తిన్నాము. దాని క్రొవ్వును మేము మా శరీరాలకు రాసుకునే వారము. తద్వారా ఆకలి కారణంగా బలహీనపడిన మా శరీరాలు మరల శక్తివంతముగా, ప్రకాశవంతంగా మారిపోయాయి. హజ్రత్ జాబిర్ రజి ఇలా పేర్కొన్నారు: "తిమింగలం కళ్ళు పెద్ద పెద్ద కుండల వలే ఉన్నాయి. " మేము దాని నుండి అనేక కుండల నూనెను తీసాము. దాని శరీరం నుండి పెద్ద భాగాలను కత్తిరించాము. దాని కొంత మాంసాన్ని మేము మార్కెట్లో అమ్మేశాము."**(అల్లామా అబుల్-షేక్అస్ఫహాని, కితాబుల్-అతిమా, భాగం 4, పేజి 1398 కథనం 914)**

తిమింగలం కంటి లోపల కూర్చోవడం గురించి, రెండు రకాల కథనాలు ఉన్నాయి. హజ్రత్ జాబిర్ రజి ఇలా వర్ణించారు: "మేము ఆరుగురు వ్యక్తులం తిమింగలం కంటి లోపల కూర్చోగలిగాము," అయితే మరొక కథనంలో, 30 మంది దాని లోపల కూర్చోగలిగారని ప్రస్తావించబడింది. హజ్రత్ అబూ ఉబైదహ్ రజి దాని ప్రక్కటెముకలలో ఒకదానిని మరొక కథనం ప్రకారం వారు రెండు ప్రక్క టెముకలను తీసుకోని నిలబెట్టారు. ఆ తరువాత వారు అందరికంటే పొడవైన వ్యక్తి హజ్రత్ ఖైస్ రజిను అన్నిటికంటే పెద్దదైన ఒంటెపై కూర్చోమని చెప్పాడు. ఆ తరువాత వారు దాని కిందకు వెళ్లారు, అయినా కూడ వారు ఆ ప్రక్కటెముకలను తాకలేక పోయారు.

మదీనాకు తిరుగు ప్రయాణం గురించి, హజ్రత్ జాబిర్ రజి ఇలా తెలిపారు: "మేము మదీనాకు తిరిగి వచ్చినప్పుడు, తిమింగలం గురించి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు చెప్పాము." దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: "అల్లాహ్ మీకు

**నూరుల్ ఇస్లాం శాఖ:**

**అహ్మదియ్య ముస్లిం జమాఅత్‌ను గూర్చి సరైన వివరాలు తెలుసుకోవడం కోసం మీరు ఈ క్రింది టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించగలరు.**
**టోల్ ఫ్రీ నెంబర్: 1800 103 2131**
**సంప్రదించు సమయం: ప్రతిరోజు ఉదయం 08:30 నుండి రాత్రి 10:00 వరకు. (ప్రతి శుక్రవారం సెలవు).**

ఇచ్చిన ఆహారం నుండి మీరు తినండి. మీ దగ్గర ఏమైనా మిగిలి ఉంటే, మాకు కూడా తినడానికి కొంత ఇవ్వండి." వారిలో ఒకరు దైవ ప్రవక్త (స) కు ఒక భాగం ఇచ్చారు. ప్రవక్త (స) దాని నుండి తిన్నారు."

**(సుబులుల్-హుదా వర్రిషాద్, వాల్యూమ్. 6, దారుల్ కుతుబుల్ ఇల్మియా, బీరుట్, పేజీలు. 177-178) (సహీ-బుఖారీ, కితాబుల్-మఘాజీ, బాబ్ ఘజ్వాతి సిఫుల్-బహర్, హదీస్ 4360-4362) (నిమతుల్-బారి, వాల్యూమ్. 7, జియా అల్-ఖురాన్ పబ్లిషర్స్, కరాచీ, పేజీలు. 747) ( ఫత ఉల్-బారి, వాల్యూమ్. 8, ఖాదిమి కుతుబ్ ఖానా అరామ్ బాగ్, కరాచీ, పేజీలు. 100) (సిరతుల్-హలాబియా, వాల్యూమ్. 3, దారుల్ కుతుబుల్ ఇల్మియా, బీరుట్, పేజీలు. 270)**

ఈ సంఘటన ఇంతటితో ముగిసింది. ఈ ప్రస్తావనను త్వరగా పూర్తి చేయడానికి ప్రయత్నించాను. తద్వారా ఇతర అంశాలపై కూడా ప్రస్తావన ప్రారంభించవచ్చును. కాని కొన్ని జనాజ నమాజ్‌లు, అమరుల ప్రస్తావనలు మధ్యలో వచ్చాయి. అందువలన ఈ ప్రస్తావనలో ఇంకా కొంచం మిగిలి యున్నది. చివరిలో మక్కా విజయంను గూర్చిన ప్రస్తావన కూడ గలదు. మొత్తానికి ఈ ప్రస్తావన కొనసాగుతుంది. కాని ఈ రోజు నేను ఈ ఆంశాన్ని కూడ ప్రస్తావించాలను కుంటున్నాను. గత జుమా ప్రసంగంలో కూడ ప్రస్తావించాను. భారతదేశం, పాకిస్తాన్‌ల మధ్య నెలకొన్న యుద్ధ పరిణాలను గూర్చి కూడ చాలా ఎక్కువగా దుఆలు చేయండి. అనగా వారి మధ్య సయోధ్య మరియు శాంతి నెలకొల్పబడాలని విస్తృతంగా దుఆలు చేయండి. ఎందుకనగా నేడు యుద్ధాలలో ఉపయోగించే ఆయుధాలను చూసినట్లయితే వాటి వలన నగర ప్రజలు చనిపోతుంటారు. నేడు నెలకొన్న నూతన యుద్ధ విధానాలు పౌర జీవితాలను కూడా నాశనం చేస్తున్నాయి. అందువల్ల, రెండు దేశాలు ఒకదానితో ఒకటి రాజీపడటానికి మరియు ఎక్కువ నష్టం జరగకుండా తమను తాము రక్షించుకోవడానికి ముందుకు రావాలని ప్రార్థించండి.

దీనికి సంబంధించి, గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటనగా, సోషల్ మీడియా, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు మరియు ఇతర ఎలక్ట్రానిక్ మీడియా మార్గాల ద్వారా ప్రజలు తమ స్వంత అభిప్రాయాలను మరియు అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరుస్తున్నారు. వాటి వలన ప్రయోజనం తక్కువ, నష్టం చాలా ఎక్కువ జరుగుతుంది. తాము ఏమి కోరుకుంటున్నారో చాలా గొప్పగా చెప్పుకుంటారు.

అయితే, అహ్మదీలు వీటి నుండి దూరంగా ఉండాలి ఎందుకంటే అలాంటి అభిప్రాయాలను వ్యక్తపరచడం వలన లాభం తక్కువ, నష్టం ఎక్కువ జరుగుతుంది. ఒకవేళ ఎవరికైన ఏదైన సందేశాన్ని అందించాలనే ఉత్సాహం ఎక్కువగా ఉన్నచో వారు శాంతి, సామరస్యతలకు చెందిన సందేశాన్ని అందించడానికి ప్రయత్నించండి.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారు కూడ తమ జీవితపు చివరిలో రోజులలో శాంతి సందేశం అనే పుస్తకాన్ని రచించారు. ఆ పుస్తకంలో వారు (అ) శాంతి, సామరస్యములతో కూడిన సందేశాన్నే ఇచ్చారు. కావున ప్రతి అహ్మదీయుడు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఆ సందేశాన్నే వ్యాపింప జేయుటకు ప్రయత్నించాలి. అల్లాహ్ తాలా ఆమయాకులందరి ప్రాణాలను కాపాడుగాకా!. కొన్ని అభివృద్ధి చెందిన దేశాలు యుద్ధాన్ని రెచ్చగగొట్టే విధముగా వ్యవహరిస్తున్నాయి. ఇరు దేశాలు పోరాడాలని, ఫలితముగా బలహీన పడాలని, ఈ క్రమంలో వారి ఆయుధాలు కొనుగోలు కావాలని అవి చూస్తున్నాయి. అలాంటి వారి దుర్బుద్ధి నుండి అల్లాహ్ తాలా అందరిని కాపాడుగాకా!.

అదేవిధంగా, పాలస్తీనా ప్రజల కోసం దుఆలు చేయండి. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వారికి సౌకర్యాన్ని కల్పించుగాకా!. వారు తమ దేశంలో శాంతియుతంగా జీవించుదురు గాకా!. కాని బాహ్య పరిణాలను చూసినచో అక్కడ శాంతిని స్థాపించే అవకాశమే కనిపించడం లేదు. అక్కడి నాగరికులను ఆ ప్రాంతం నుండి తరిమి వేయాలనే ప్రయత్నాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ కుట్రలో అగ్రదేశాలు అన్ని పాల్గొంటున్నాయి.

ముస్లిం దేశాలన్నింటికి అల్లాహ్ తాలా జ్ఞానాన్ని ప్రసాదించుగాకా!. ఫలితముగా వారు ఐక్యముగా ఉందురు గాకా!. ఒకవేళ ఐక్యముగా ఉన్నట్లయితే అనేక రకాల సమస్యలు దూరమైపోతాయి.

ఒకవేళ ప్రపంచ యుద్ధం జరిగినా కూడ కొంత మంది ప్రజలు, కొన్ని దేశాలు తమకు ఏమి కాదని భావిస్తున్నారు, భావిస్తున్నాయి. కాని ఇది పొరపాటు. ఈ యుద్ధం అందరిని వినాశనంలోకి నెట్టిపడేస్తుంది. కావున ఇలాంటి అపోహల నుండి అందరు బయట పడాలి. అల్లాహ్ తాలా అందరిని కాపాడుగాకా!. మొత్తానికి ఇందుకు సరైన పరిష్కారం. మార్గం నేను పదే పదే గతంలో చెప్పినట్లుగా కేవలస్త్రం అల్లాహ్ ముందు మోకరిల్లడమే. ఆ మార్గమే అందరిని కాపాడగల్గుతుంది. అది కాకుండా మరే మార్గం లేదు. అల్లాహ్ తాలా అందరికి దుఆ చేయు భాగ్యాన్ని కల్పించుగాకా!.

**(అల్ ఫజల్ ఇంటర్నేషనల్, 30 మే 2025, పేజి 2-7)**

## వఖ్ఫేనౌ బాలబాలికలను ఉద్దేశించి హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ గారు చేసిన ప్రసంగం:

అల్లాహ్ తాలా కృపానుసారం జమాఅత్ సభ్యులు తమ పిల్లలను దైవ మార్గములో అంకితం చేయుటవైపు శ్రద్ధ చూపుచున్నారు. నాకు ప్రతి రోజు ఇందుకై వారి తల్లిదండ్రుల నుండి ఉత్తరములు అందుచున్నవి. గత కొన్ని రోజులుగా తమ పిల్లలను వఖ్ఫె నౌ లో చేర్చాలని క్రమం తప్పకుండా 20 నుండి 25 వరకు ఉత్తరములు అందుచున్నవి. హజ్రత్ నాలుగవ ఖలీఫా గారు ఇలా దైవ మార్గములో అంకితము కొరకు పిలుపు నిచ్చిన రోజులలో ఆ పథకం తాత్కలికంగానే కొనసాగినది. కాని ఆ తరువాత రోజులలో ఆ పథకంను శాశ్వతము చేసిరి. ఫలితముగా అన్ని దేశాలలోని జమాఅత్ సభ్యులు, ప్రత్యేకించి తల్లులు ఈ పథకమును విజయవంతము చేయుటకు ముందుకు వచ్చినారు. గత 12, 13 సంవత్సరాల క్రితం వరకు తల్లిదండ్రులు చూపిన శ్రద్ధ వలన వీరి సంఖ్య కేవలం 28000 వరకు మాత్రమే ఉండేది. కాని అల్లాహ్ తాలా అనుగ్రహము వలన నేడు ఆ సంఖ్య 61,000 వరకు చేరినది. వీరిలో 36 వేల కన్న అధికులు బాలలు కాగా, మిగిలిన వారు బాలికలు. అనగా సమయము గడుస్తున్న కొద్ది తమ పిల్లలు జన్మించక ముందే దైవ మార్గములో అంకితముచేయాలనే స్ఫూర్తి రోజు రోజుకు మన జమాఅత్ సభ్యులలో పెరుగుచున్నది.

కాని కేవలం పిల్లలను అంకితము చేయడంతోనే తల్లిదండ్రుల బాధ్యత నెరవేరదు, వాస్తవానికి గతంలో కన్న అధికంగా బాధ్యతలు పెరుగును. నిస్సందేహముగా ఒక అహ్మది బాలుని సంస్కరణ బాధ్యత వారి తల్లిదండ్రుల పైనే ఉండును. వారి పిల్లలు ప్రాపంచికముగా, విద్యా పరంగా ఎదగాలని, సంస్కరించ బడాలని, ధార్మిక బోధనను అవలంభించాలని ధార్మిక అవగాహన కల్గిన తల్లిదండ్రులు కోరుకుంటారు. కాని ప్రతి అహ్మది బాలురు, ప్రత్యేకించి వఖ్ఫెనౌ బాలురు వారి వద్ద జమాఅత్ న్యాసమని గుర్తుంచుకోవాలి. ఎందుకనగా మాకు పుట్టబోవుచున్న బాలుడు లేదా బాలికను అల్లాహ్ తాలా, అతని ధర్మము కొరకు మరియు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం నిజమైన దాసుని లక్ష్యమును ఛేదించుటకు అనగా మార్గ దర్శనము సంపూర్ణము చేయుటకు, ఇస్లాం బోధనను ప్రపంచములో వ్యాపింప జేయు లక్ష్యమును, అల్లాహ్ తాలా హక్కులను చెల్లించుట వైపు ప్రపంచమునకు దృష్టి కల్గించే లక్ష్యము కొరకు జన్మించక ముందే మేము సమర్పించుచున్నామని తల్లి దండ్రులు ప్రతిజ్ఞ చేస్తారు కావున వారి సంస్కరణ, వారి ధార్మిక , ప్రాపంచిక బోధన గూర్చి ప్రత్యేక శ్రద్ద చూపి వారిని ఉత్తములుగా తీర్చిదిద్ది జమాఅత్‌కు అందించుట తల్లిదండ్రుల బాధ్యత.

కావున ఇది కేవలం సామాన్యమైన బాధ్యత కాదు. వఖ్ఫె నౌ తల్లిదండ్రులు ప్రత్యేకంగా తల్లులు తమ పిల్లలను జన్మించక ముందే అల్లాహ్ తాలాతో ఒక ప్రతిజ్ఞ చేయుచు అతని మార్గంలో సమర్పించుదురు. అంతేగాకా హజ్రత్ మర్యమ్ గారి తల్లి వలె మేము అల్లాహ్ తాలాతో ప్రతిజ్ఞ చేయుచు తమ పిల్లలను వఖ్ఫె నౌ పథకంలో ప్రవేశ పెట్టుచున్నామని వర్తమాన ఖలీఫాకు ఇట్లు వ్రాయుదురు. "**రబ్బి ఇన్ని నజర్తు లక మా ఫి బతిని ముహర్రరన్ ఫతకబ్బల్ మిన్ని ఇన్నక సమీఉల్ అలీమ్"** (ఆలే ఇమ్రాన్:36) అనగా ఓ నా పోషకుడా! నా గర్భములో ఉన్నదానిని నేను నీ కొరకు సమర్పించుచున్నాను. బాలుడా లేకా బాలికా అనునది నాకు తెలియదు. వారు ఎవరైనను ధార్మిక సేవకులుగా కావాలని నా కోరిక, నా దుఆ. **ఫతకబ్బల్ మిన్ని** నా ఈ కోరికను, దుఆను, ఈ సంతానాన్ని ఆమోదించుము. **ఇన్నక అంతల్ సమీ ఉల్ అలీమ్** నిశ్చయముగా నీవు సర్వ శ్రావణ సమర్ధుడవు, సర్వజ్ఞుడవు. తన పిల్లలను వఖ్ఫె నౌలో సమర్పించే సమయమున ఒక తల్లి ఇలా ఆశించును. ఇందులో తండ్రి కూడ పాల్గొనును.

వఖ్ఫె నౌ పథకములో తమ పిల్లలను చేర్చు తల్లులు పై విధముగా దుఆ చేసినప్పుడు తమ ప్రతిజ్ఞను నెరవేర్చుటకు, తమ దుఆలను ఆమోదింప జేసుకొనుటకు తల్లిదండ్రులపై గల బాధ్యతలను వారు తప్పక నెరవేర్చవలెను. వఖ్ఫె నౌ పథకములో తల్లి దండ్రులు తమ పిల్లలను తమ అభీష్టము మేరకే చేర్చుతారు.

పూర్వికుల గాధను ఒక కథగా వినిపించే ఉద్దేశముతో ఈ దుఆను అల్లాహ్ తాలా పవిత్ర ఖుర్ఆన్‌లో భద్రపర్చలేదు. అల్లాహ్ తాలాకు ఈ దుఆ ఎంతగా నచ్చినదనగా భవిష్యత్తులో రాబోవు తల్లులు కూడ ఈ దుఆ చేసి తమ పిల్లలను ధర్మము కొరకు అసాధారణ రీతిలో త్యాగము చేసే విధముగా సిద్దము కావాలని దీనిని భద్ర పరచెను. యదార్థమేమనగా ప్రతి విశ్వాసి ధర్మమునకు ప్రాపంచికముపై ప్రాధాన్యత నిత్తునని ప్రతిజ్ఞ చేయును. కాని వఖ్ఫ్ చేయువారు ఈ ప్రామాణికముల

శిఖర స్థాయికి చేరవలెను. మీరు సమర్పించ బడినవారు. మీరు కేవలం ధార్మిక సేవ చేయవలెను. ఇదే మీ జీవిత లక్ష్యమని బాల్యము నుండే తల్లిదండ్రులు వారికి తెలుపుచు దుఆ కూడ చేసినచో తాము ధార్మిక సేవలోనే జీవితమును గడపాలనే ఆలోచనతోనే పిల్లలు పెరుగుతారు. మేము వ్యాపారస్తులము కావాలి, మేము ఆటగాళ్లము కావాలి, మేము ఇతర శాఖలలో పని చేయాలి అనే ఆలోచనలతో పెరుగరు. నేను వఖ్ఫె నౌ బాలురను , నేను ఏ శాఖలో పని చేయాలో నాకు జమాఅత్ యే సూచించవలెను, వర్తమాన ఖలీఫా గారే మేము ఏ శాఖలో పని చేయాలో మాకు సూచించాలని వారు ప్రశ్నించుదురు. అప్పుడే వారు నాకు ఇక ఈ ప్రపంచముతో ఎలాంటి సంబంధము లేదని భావించుకొని, మా జననం కన్న ముందు మా తల్లి చేసిన వాగ్దానమును, దుఆలను మరియు నేను ధార్మికమును సాదించాలనే లక్ష్యముతో మా తల్లి నాకు ఇచ్చిన క్రమ శిక్షణను అల్లాహ్ తాలా సంతోషంగా స్వీకరించి, మెచ్చి ప్రతిఫలమును చేకూర్చినందుకు నేను ఎంతో అదృష్టవంతునిగా భావిస్తున్నాని తెలుపుచు, ఇక నాకు ప్రపంచముతో ఎలాంటి సంబంధము లేనందున నేను నిస్వార్ధముగా, ఎలాంటి ఆపాచన లేకుండా కేవలం ధార్మిక సేవ కొరకే నన్ను నేను సమర్పించుకుంటున్నానని ప్రకటించు కొందురు.

ఈ ప్రకటనను వఖ్ఫెనౌలో పాల్గొన్న బాలురు 15 సంవత్సరాల వయస్సులో తమ వాగ్ధానమును తప్పక పున: పరిశీలన చేసుకుంటు ప్రకటించుకోవలెను. ఇందుకు నేను సంబంధిత అధికారులను వఖ్ఫెనౌ బాల బాలికలు 15 సంవత్సరాలు నిండిన తరువాత తమ వఖ్ఫ్‌ను కొనసాగించెదరా? లేదా? లిఖిత పూర్వకముగా సేకరించగలరని సూచించడమైనది. ఆ తరువాత తమ విద్యను పూర్తి చేసుకున్న పిదప 20 లేదా 21 వ సంవత్సరములో జామియాలో చేరని వారందరు మరోసారి తమ వాగ్దానమును పున: పరిశీలించుకొని లిఖిత పూర్వకముగా సంబంధిత కార్యాలయములో జమ చేయవలెను. ఆ తరువాత వారు ఏదేని ఒక శాఖలో స్పెషలైజేషన్ చేయదలచినచో మరల లిఖిత పూర్వకముగా దరఖాస్తు చేసుకోవలెను. ఈ విధముగా వఖ్ఫె నౌ బాలురు ప్రతి నూతన అడుగులో తమ వాగ్దానమును నెరవేర్చెదనని తామ మనస్పూర్తిగా లిఖిత పూర్వకముగా సమర్పించుకోవాలి.

నేను గతంలో కూడ అనేక సార్లు ఈ అంశంపై వివరముగా తెలుపడం జరిగినది. మేము తమను తాము సమర్పించుకున్నచో మా ప్రాపంచిక జీవనం ఎలా సాగును? లేదా మేము తల్లి దండ్రులకు ఆర్ధికముగా, బాహ్యముగా లేదా మరే విధముగా ఎలా సేవలు చేయగలము? ఎలా సహాయము నందించగలము? అనే ఆలోచనలు వఖ్ఫె నౌ బాలురకు కలుగకూడదు. కొన్ని రోజుల క్రితం నేను వఖ్ఫెనౌ బాలురకు తరగతి తీసుకొనుచున్న సమయంలో ఒక బాలుడు "ఒకవేళ మేము జమాఅత్ కొరకు తమను తాము అంకితము చేసుకొని జీవితమంతయు జమాఅత్‌కు సేవ చేసినచో మా తల్లి దండ్రులకు ఏ విధముగా ఆర్ధిక పరంగా, బాహ్యముగా సహాయము నందించగలము? అని నన్ను ప్రశ్నించెను. మేము నిన్ను జమాఅత్‌కు అంకితము చేసినాము, నీవు మా వద్ద జమాఅత్ న్యాసమని, ఇతర సోదర సోదరీమణులు మాకు సేవలందిస్తారు, మాకు సహాయము నందించెదరు నీవు కేవలం వర్తమాన ఖలీఫా గారికి తనను తాను అంకితము చేసుకొనుము, వారి ఆదేశాలను తూచ తప్పక పాటించుము అని ఆ బాలునికి బాల్యము నుండే వారి తల్లిదండ్రులు తెలుపలేదని ఈ ప్రశ్న ద్వారా తెలియుచున్నది.

హజ్రత్ మర్యమ్ దుఆలో **ముహర్రరన్** అనే పదమును ఉపయోగించబడెను. అనగా నేను ఈ పసికందును ప్రాపంచిక ఆలోచనల నుండి పూర్తిగా దూరం చేసానని, కావున వీరు పూర్తిగా ధార్మిక సేవ చేయాలనునదే నా ఆకాంక్ష అని ఆ పదము యొక్క అర్ధము.

కావున వీరి తల్లి దండ్రులకు నేను ముఖ్యముగా చెప్పదల్చినది ఏమనగా వఖ్ఫె నౌ అనే నామకరణం ఉన్నంత మాత్రమునే సరిపోదు. వాస్తవానికి వఖ్ఫ్ అనేది చాలా పెద్ద బాధ్యత. వఖ్ఫె నౌ బాలురు యవ్వనంలోకి అడుగిడునంత వరకు తల్లిదండ్రుల బాధ్యత, ఆ తరువాత తమ బాధ్యతలను వారే స్వయంగా నెరవేర్చుకోవలెను. ప్రాపంచిక విద్య నభ్యసించిన కొందరు బాల బాలికలు చాలా ఉత్సాహమును ప్రదర్శిస్తు తమ సేవలను జమాఅత్‌కు అందించడం ప్రారంభిస్తారు, కాని ఆ తరువాత జమాఅత్ అందిస్తున్న అలౌన్స్‌తో తమ జీవనం గడవడం లేదని కొందరు తమ వఖ్ఫ్‌ను రద్దు చేయించుకుంటారు. ఒక ఉన్నత ఆశయ సాధన కొరకు కొంత వరకు తప్పక కష్టించవలసి, కొంత వరకు త్యాగము చేయవలసి వచ్చును. ఈ విషయాన్ని తల్తిదండ్రులు తమ పిల్లలకు బాల్యం నుండే అర్థమవునట్లు చెప్పినచో, నా తోటి విద్యార్ధులు నాతో సమానంగా విద్యనభ్యసించిన వారు నెలకు లక్షలకు లక్షలు సంపాదిస్తున్నారు. నాకు జమాఅత్ ఇచ్చే అలౌన్స్ మొత్తము కూడ వారి ఒక రోజు సంపాదనకు సమానంగా లేదని వారు ఆవేదన చెందుటకు బదులు అల్లాహ్ తాలా నాకు అందించిన స్థానము ప్రపంచ ధనము కన్న ఎంతో గొప్పదని భావించెదురు. ప్రాపంచిక ధనము, వనరుల విషయంలో తన కన్న దిగువ స్థాయి కల్గిన వారిని చూడమని, ఆధ్యాత్మికముగా తన కన్న ఎగువ స్థాయి గల వారిని చూడవలెననే హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశమును మనము చూడవలెను. కావున ప్రాపంచిక పరుగులో ముందుకు వెళ్ళే బదులు ఆధ్యాత్మిక పరుగులో ముందుకు వెళ్లుటకు ప్రయత్నించాలి.(బుఖారి ఖితాబ్ అర్రికాక్, బాబ్ లియంజుర్ ఇలా మన్‌హువ అస్‌ఫలా.హదీస్ సంఖ్య 6490)


కావున వఖ్ఫెనౌ బాలురు తమ విద్యభ్యాసం ముగిసిన తరువాత ప్రాపంచిక పరంగా, ఆర్ధిక పరంగా మెరుగొద్దుటకు బదులు ఆధ్యాత్మికముగా అభివృద్ధి చెందుటకు ప్రయత్నించాలి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అహ్మదీయులందరి ఆధ్యాత్మిక ప్రామాణికము శిఖర స్థాయిలో ఉండాలని ఆకాంక్షించే వారు. అలాంటప్పుడు ఒక బాలుడు జన్మించక ముందే అతని తల్లి దండ్రులు దుఆలు చేస్తూ అతనిని ధార్మిక సేవ కొరకు అంకితము చేసినప్పుడు ఆ బాలురుల ఆధ్యాత్మిక ప్రామాణిక స్థాయి ఎంతటి ఉన్నత శిఖరాగ్ర స్థాయిలో ఉండాలో ఒక్క సారి ఆలోచించండి.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు ఉపదేశించిరి: " నా జమాఅత్ సభ్యులనుద్దేశించి నేను ఉపదేశించాలని, వారందరి వరకు నా ఉపదేశమును చేరవేయాలనే నా బాధ్యతను నేను గుర్తెరుగుదును. ఇక ముందు ఎవరైన ఆలకించదలచినను, ఆలకించ దలచకున్నను నేను తెల్పు విషయమేమనగా ఒకవేళ ఎవరైన మోక్షమును పొందగోరినచో, సజ్జనుడి జీవనంను అనుభవించ దలచినచో లేదా వారు శాశ్వతమైన జీవనంను కొనసాగించ దలచినచో వారు దైవం కొరకు తమ జీవితంను అంకితము చేయగలరు. అదే విధముగా నా జీవితం, నా మరణం, నా త్యాగాలు, నా ప్రార్ధనలు అన్ని అల్లాహ్‌కే అంకితమనే స్థాయికి చేరు విధముగా ప్రతి ఒక్కరు ప్రయత్నించవలెను. అందుకై చింతించ వలెను. మరియు హజ్రత్ ఇబ్రాహీం వలే వారి ఆత్మ కూడ అస్లమ్‌తు లిరబ్బిల్ ఆలమీన్ (అల్ బఖ్రా: 132) అని సాక్ష్యమియ్యవలెను." అనగా నేను నా సంరక్షకుణికి విధేయుడనైనాను. మరల ఇట్లనిరి: " మానవుడు దైవభక్తిలో లీనము కానంత వరకు, దైవ స్మరణంలో లీనమై మరణంను పొందనంత వరకు అతడు నూతన జీవితమును పొందలేడు. కావున నాతో అనుబంధమును పెంచుకొన్న మీరందరు నేను నా జీవితంను దైవ మార్గములో అంకితము చేయడంను వీక్షిస్తున్నారు." ఇదే జీవిత లక్ష్యం, ముఖ్యోద్దేశం." నా ఈ సాంప్రదాయమును మీలో ఎందరు అనుసరించుటకు ఆసక్తి చూపుచున్నారో, ఎందరు దైవ మార్గములో జీవితంను అంకితము చేయుటను ఘనతగా భావించుచున్నారో ఒక్కసారి మీరు కూడ ఆత్మ పరిశీలన చేసుకొనుము."

( మల్ఫూజాత్ సంపుటి 2, పుట 100. ఎడిషన్ 1985, ప్రచురణ లండన్)

కావున వాఖ్ఫినే నౌ ఒక సాధారణ అహ్మదీయుని కన్న ఉన్నత స్థాయిని పొందుటకు ప్రయత్నించవలెను. ధార్మిక సేవ కొరకు కొందరు తమ జీవితమును

J.K WOOD WORKS Mob.9393727201
Spl.Capboard & Interior 7989385296
#8-125/A, Chandanagar, Hyderabad
దుఆ ఆశించువారు: SK Meera sb, Jagadth giri gutta, Hyderabad, (Telangana)



Love for All Hatred for None
99493-56387
Prop:Muhammad Saleem
MASROOR HOTEL
TEA,TIFFIN,MEALS,CHICKEN-BIRYANI,FAST-FOOD AVAILABLE HERE
Near Naidu Petrol Pump, Khammam Rd. Warangal (Telengana)
Mohammad Saleem (Naib Ameer Zila Jamat Ahmadiyya Warangal (Telengana)

అంకితము చేయుదరు, అందరు తమ జీవితమును అంకితము చేయలేరు. ఈ విషయమును కూడ అల్లాహ్ తాలా పవిత్ర ఖుర్ఆన్‌లో ఈ విధముగా తెలుపెను. " మీలో ఒక వర్గం ధార్మిక విద్యను అభ్యసించుటకై తమను తాము అంకితము చేసుకోవలెను, ఆ తరువాత ప్రాపంచిక సాధనలో తలమునకలైన తమ వారికి ఆ విద్యను బోధించవలెను." ప్రపంచిక కార్యములో నిమగ్నమై కూడ ధర్మమునకు, దైవభీతికి అధిక ప్రాధాన్యతను ఇవ్వమని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కూడ సెలవిచ్చిరి.

( మల్ఫూజాత్ సంపుటి 2, పుట 91. ఎడిషన్ 1985, ప్రచురణ లండన్)

వాఖ్ఫీనే నౌ వారు తమ జీవనపు నిరాడంబర ప్రామాణికమును చాలా పెంచుకోవలెను. తమ త్యాగ ప్రమాణికములను కూడ పెంచుకోవలెను. మేము ఆర్థికముగా బలహీనంగా యున్నచో మా సోదర సోదరీమణులు తమను చిన్న చూపు చూచెదరని లేదా తల్లిదండ్రుల ఇతరులను చూసినట్లు తమవైపు శ్రద్ధ చూపరని భావించుకోకూడదు. జీవిత సమర్పికులు బలహీనులనే ఆలోచనలను ముందుగా తల్లిదండ్రులు ఆలోచించకూడదు. వారి దృష్టిలో జీవిత సమర్పికుల స్థాయి ఎంతో ఉన్నతమైనదిగా యుండవలెను. కాని జీవిత సమర్పికులు ఎల్లప్పుడు తమను తాము ప్రాపంచిక పరంగా తక్కువ స్థాయి గల వారిగానే భావించుకోవాలి.

వాఖ్ఫీనే నౌ తమ త్యాగ ప్రామాణికములను పెంచుకున్నట్లు తమ ప్రార్థనల ప్రామాణికమును కూడ పెంచుకోవలెను. తమ విశ్వసనీయత ప్రామాణికమును పెంచుకోవలెను. తమ తల్లిదండ్రుల ప్రతిజ్ఞను పూర్తి చేయుటకు తమ ప్రతిభను, సామార్థ్యములను శక్తి మేరకు వినియోగించుటకు ప్రయత్నించవలెను. ధర్మ ఔన్నత్యము కొరకు సేవ చేయవలెను. అప్పుడే అల్లాహ్ తాలా అనుగ్రహించును. ఫలితము నొసంగకుండా వీడదు.

తమ ప్రతిజ్ఞలను విశ్వసనీయతతో పూర్తి చేయుట గూర్చి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక చోట ఇట్లు వ్రాసిరి. "ఈ విషయం వలనే అల్లాహ్ తాలా హజ్రత్ ఇబ్రహీం అలైహిస్సలాంను ప్రశంసించాడు. వ ఇబ్రాహిమల్లజి వఫ్ఫా (అన్నజమ్: 38) అనగా అతను చేసిన ప్రతిజ్ఞను పూర్తి చేసెను."

( మల్ఫూజాత్ సంపుటి 6, పుట 234. ఎడిషన్ 1985, ప్రచురణ లండన్)

కావున ప్రతీజ్ఞలను పూర్తి చేయుట చిన్న విషయము కాదు. జీవిత సమర్పితుని ప్రతీజ్ఞను గూర్చి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బాధతప్త పదములను మనము విన్నాము. ఇది కూడ అలాంటి ప్రతీజ్ఞయే. ప్రతి వఖ్ఫే నౌ బాల బాలికలు తమ ప్రతీజ్ఞను పూర్తి చేసినచో ప్రపంచములో మనము ఒక గొప్ప విప్లవమునను సృష్టించగలము. కొందరు వఖ్ఫె నౌ దంపతులు నా వద్దకు వచ్చి, నేను వఖ్ఫెనౌ లో ఉన్నాను., నా శ్రీమతి వఖ్ఫెనౌలో ఉన్నది, మా పిల్లలు కూడ వఖ్ఫెనౌలో చేర్పించామని తెలుపుతుంటారు. కొందరిలో భార్య లేదా భర్త తమనుతాము వఖ్ఫె నౌలో ఉన్నట్లు పరిచయం చేసుకొంటు తమ పిల్లలను కూడ వఖ్ఫెనౌ పథకంలో చేర్పించినట్లు తెలుపుచుంటారు. ఇది చాలా ఘనకార్యమని మనము చెప్పుకోవచ్చును. కాని వారు తమ వఖ్ఫ్ సమయంలో చేసిన ప్రతిజ్ఞలను విశ్వసనీయతతో అమలు పర్చినప్పుడే వారి వలన జమాఅత్‌కు ప్రయోజనం చేకూరుతుందని మనము భావించవచ్చును.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాం ఆధారముగా విశ్వసనీయత అనే అంశంను గూర్చి మరొక చోట కూడ విపులీకరించడమైనది. వారు (అ) ఇట్లు తెల్పిరి: " దైవానుగ్రహం పొందుటకు చక్కని మార్గం అతని పట్ల నీవు విధేయతను ప్రదర్శింపుము." నిజాయితిని చూపుము, అల్లాహ్ తాలా పట్ల నిష్కల్మశమైన విధేయత చూపాలి. " హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాం దైవానుగ్రహంను ఈ మార్గం ద్వారనే పొందెను. అందుకే అల్లాహ్ తాలా **ఇబ్రాహీమల్లజి వఫ్ఫా** (అన్నజమ్: 38) అని ప్రకటించెను. అనగా ఇబ్రాహీం తన విధేయతను ప్రదర్శించి ఇబ్రాహీంగానే నిలిచాడు. దైవం పట్ల విధేయత, స్వచ్ఛత, సత్యతను ప్రదర్శించటం ఒక మరణంను ఆకాంక్షించును. అల్లాహ్ తాలాతో విశ్వసనీయత, స్వచ్ఛత, వినమ్రతతో వ్యవహరించుట ఒక మరణంను ఆశించును. మానవుడు ప్రపంచము, దాని ఆనందములను, ఆడంబరాలను వీడుటకు సిద్ధము కాకుండా, అన్ని రకాల అవమానములను, ఇబ్బందులను అల్లాహ్ కొరకు భరించుటకు సిద్ధము కానంత వరకు ఆ లక్షణము వెలువడదు. ఒక వృక్షము లేదా రాయిని పూజించుటయే విగ్రహారాధన కాదు. అల్లాహ్ తాలా సామీప్యము నుండి దూరం చేయు, అతనికెదురుగా నిలుచు ప్రతి వస్తువు విగ్రహమే. తనలో ఎన్నో విగ్రహాలను ఉన్నాకూడ మానవునికి అతడు విగ్రహారాధకుడనే విషయమే తెలియదు." నేటి కాలంలో కొందరికి సినిమాలు విగ్రహాలుగా నిలువగా, మరి కొందరికి ఇంటర్ నెట్ (అంతర్జాలము) విగ్రహముగా నిలిచినది. కొందరికి ప్రపంచ సాధనయే విగ్రహారాధన కాగా, మరి కొందరికి వారి తుచ్ఛ కోరికలే విగ్రహారాధనగా మారినవి. అందుకే మానవుడు తనలో ఎన్నో విగ్రహాలను ప్రతిష్టించుకొని, వాటిని కొలుస్తున్నాడు. కాని ఈ సత్యమును మానవుడు గుర్తించడం లేదని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మనకు తెలుపడం జరిగినది. " అందుకే మానవుడు ప్రత్యేక భక్తి శ్రద్ధలతో దైవంను ఆరాధించనంత వరకు, అతని మార్గములో ఇబ్బందులను ఎదుర్కోనంత వరకు, విశ్వసనీయత, స్వచ్ఛత ఏర్పడడం కష్టం. హజ్రత్ ఇబ్రహీం అలైహిస్సలామునకు ఆ బిరుదు ఉచితముగానే లభించినదా? కాదు. తన కుమారున్ని త్యాగము చేయుటకు సిద్ధమనప్పుడు **ఇబ్రాహీమల్లజి వఫ్ఫా** అనే వాణి వినిపించినది. అల్లాహ్ తాలా ఆచరణను వీక్షించును. ఆచరణతోనే సంతృప్తి పొందును. బాధలను ఎదుర్కొన్నప్పుడే ఆచరణ సాధ్యమగును." అనగా మానవుడు సత్కార్యములు చేయుటకు, దైవానుగ్రహమును పొందుటకు కొన్ని త్యాగాలు చేయవలసి వస్తుంది. అందుకోసం మానవుడు తననుతాను కష్టాలకు, బాధలకు గురి చేసుకోవలసి వస్తుంది. త్యాగాలు బాధలను కల్గించినను, కాని ఆ బాధలలో మానవుడు ఎల్లప్పుడు ఉండదు. " మానవుడు బాధలను ఎదుర్కొనుటకు సిద్ధపడినచో అల్లాహ్ తాలా అతనిని బాధలకు గురి చేయదు………… ఇబ్రాహీం అలైహిస్సలాం దైవాదేశను సారం తన కుమారుడిని బలి ఇచ్చుటకు సిద్ధపడి ఏర్పాట్లన్ని చేయగానే అల్లాహ్ తాలా అతని కుమారుడిని రక్షించెను. అతడిని అగ్నికి ఆహుతి చేయగా అగ్ని అతనిని ఏమి చేయలేక పోయినది. దైవ ప్రీతి కొరకు బాధలను ఎదుర్కొనుటకు సిద్ధపడినచో అతడే మిమ్ము బాధల నుండి కాపాడును."

( మల్ఫూజాత్ సంపుటి 4, పుట 429–430. ఎడిషన్ 1985, ప్రచురణ లండన్)

అల్లాహ్ తాలా ప్రేమను ఆకర్షించుటకు ఈ ప్రమాణికము చాలా అవసరము. అతని శుభములు పొందుటకు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ ప్రమాణికమును మన ముందు ప్రవేశ పెట్టిరి. ఈ ప్రమాణికమునకు మనము చేరుకుంటామని వారు ఆశించిరి. ఈ ప్రమాణికమును వఖ్ఫె నౌ బాలబాలికలు గుర్తుంచుకోవలెను. త్యాగముల ఈ ప్రమాణికములను పొందనిదే తమ వఖ్ఫ్ ప్రకటణలు పునాది రహితమని జీవిత సమర్పితులు భావించవలెను.

మేము కెనడాకు వలస వచ్చినాము, మా కుమారుడు పాకిస్థాన్‌లో మురబ్బిగా లేకా జీవిత సమర్పికుడిగా ఉన్నాడు. కావున మీరు అతడిని ఇక్కడికి రప్పించగలరు. అతడు మావద్దకు వచ్చుటకు అతనిని ఈ దేశములోనే ఒక చోట నియమించ గలరని కొందరి తల్లులు అంటూ ఉంటారు. జమాఅత్ సేవకు అంకితము చేసిన పిదప మరల ఈ కోరికలు, ఆశలు ఎందుకు కల్గును?. కోరికలను అంతము చేసుకోవలెను. నేను ముందు తెల్పినట్లు వఖ్ఫె నౌ పథకంలో తమ పిల్లలను చేర్చు ఉద్దేశము జమాఅత్ సభ్యులలో రోజు రోజుకు బలపడుచున్నది. ఇది చాలా శుభ పరిణామము. ఈ ఆకాంక్షను దైవ ప్రీతిని పొందుటకు దృఢపర్చుకోవలెను గాని పరిస్థితులు మారగానే తమ ప్రతిజ్ఞలను బలహీన పర్చుకొనుటకు, తమ ప్రతిజ్ఞలకు భంగం కల్గించుటకు దృఢపర్చుకోరాదు.

దు:ఖము, బాధ అనుభవించనిదే త్యాగము అనబడదని హజ్రత్ మసీహ్

| **అహాదీస్ బోధనలు** | దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు: **"ఒక సమాజానికి ప్రారంభములో నేను, అదే సమాజానికి చివరిలో ఈసా ఇబ్నే మరియం ఉన్నచో ఆ సమాజం ఎన్నడు నాశనం కాదు."** (కంజూలుల్ ఆమాల్, హర్ఫ్ అల్ ఖాఫ్, కితాబుల్ ఖియామతు, బాబ్ ఖరూజుల్ మహ్ది, 38671) |
|---|---|

**దుఆ ఆశించువారు: *Muhammad Nazeer Ahmad sb, warangal, (Telangana)***

| **అహాదీస్ బోధనలు** | **"ఒక మునల్మానుడి విశిష్ట లక్షణమేమనగా, తన మునల్మాను సోదరుడిని చూసినప్పుడు అతని కోసం దగ్గరిగా కూర్చోవలెను." అనగా అతనికి కూడ కూర్చొవడానికి చోటును ఇవ్వవలెను.** (మిష్కాతుల్ మసాబిహ్, కితాబుల్ అదబ్, బాబుల్‌ఖియామ్, ఫసలుస్సాలిస్) |
|---|---|

**దుఆ ఆశించువారు: *Muhammad Vazeer Ahmad sb Babu, Mahboobnagar, (Telangana)***

మౌవూద్ అలైహిస్సలాం తెల్పిరి. ఒకవేళ పరిస్థితులు అనుకూలించనిచో సహనం పాటించవలెను. ప్రత్యేకించి తమను తాము జమాఅత్ సేవకు అంకితం చేసుకున్న వారు లేక తమ పిల్లలను అంకితము చేసిన తల్లులు, వారి తల్లిదండ్రుల ప్రతిజ్ఞను అమలు చేయుదుమని స్వీకరించిన యువకులు ఇలాంటి పరిస్థితులలో సహనంను పాటించాలి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తెల్పినట్లు మానవుడు దైవ ప్రీతి కొరకు త్యాగాలకు సిద్దపడినచో అల్లాహ్ తాలా వారికి తప్పక అనుగ్రహిస్తాడు. అల్లాహ్ తాలా ఎవరిని వృధాగా వదిలి వేయడు. అనంతముగా కరుణించును. వాఖ్ఫినులు, వారి తల్లిదండ్రులందరు వఖ్ఫ్ వాస్తవికతలను గుర్తించి తమ ప్రతిజ్ఞలను పూర్తి చేయుదురు గాకా!. తమ విశ్వసనీయత ప్రమాణికాలను ఉన్నత స్థాయికి చేర్చుదురు గాకా!.

కొన్ని నిర్వాహణ బాధ్యతలను గూర్చి, వఖ్ఫెనౌ ప్రణాళికను గూర్చి నేను సంక్షిప్తముగా మీముందు వివరించెదను. కొందరు ఈ విషయంపై ప్రశ్నిస్తున్నారు. కొందరు మీరు వఖ్ఫెనౌ పథకంలో చేరినందును మీకు ఒక ప్రత్యేక గుర్తింపు గలదని వారి మెదడులో ఆలోచనలను రేకెత్తిస్తున్నారు. వారు ప్రత్యేక గుర్తింపును కల్గిన విషయం వాస్తవమే అయినను వారి పట్ల ప్రత్యేకమైన ప్రవర్తనను చూపడం మాత్రం సాధ్యము కాదు. వాస్తవానికి వారు తమకు గల ప్రత్యేక గుర్తింపు వలన తమ త్యాగ స్ఫూర్తి ప్రమాణికములను ఉన్నత స్థాయికి చేర్చుకోవలెను. మీరు చాలా ప్రత్యేకత కల్గిన బాలలని కొందరు వఖ్ఫె నౌ బాలబాలికల మెదడులో ఆలోచనలు కల్పిస్తున్నారు. ఫలితముగా వారు తదుపరి కాలంలో కూడ తమ ఆలోచనలలో ప్రత్యేకముగానే మిగిలిపోతారు. ఇలాంటి ఆలోచనలు ఇక్కడి వారి మదిలో ఉన్నట్లు కూడ నాకు తెలిసినది. వారు వఖ్ఫ్ వాస్తవికతను విస్మరించి వఖ్ఫే నౌ టైటిల్‌ను తమ జీవిత లక్ష్యముగా భావించి మేము ప్రత్యేకమైన వారమని భావించెదరు.

కొందరు బాల బాలికలు మేము వఖ్ఫె నౌలో యున్నందున నాసిరాతుల్, లజ్న మరియు అత్ఫాల్, ఖుద్దామ్ కార్యక్రమాలలో పాల్గొనవలసిన అవసరం లేదని ఆలోచించడం ప్రారంభించారు. మాది వేరు చేయబడిన శాఖయని వారు భావిస్తున్నచో అది కేవలం ఒక భ్రాంతియేనని వారు గుర్తుంచుకోవాలి. జమాఅత్ పదవి దారులు ఎవరైన, చివరికి జమాఅత్ అధ్యక్షుల వారైన వారి వయస్సు కనుగుణంగా వారు జమాఅత్ ఉప శాఖల సభ్యులుగానే పరిగణించ బడుతారు.

కావున వఖ్ఫెనౌ బాల బాలికలు వారి వారి వయస్సు కనుగుణంగా వారి వారి ఉపశాఖలకు సభ్యులనే వాస్తవాన్ని గుర్తుంచుకోవాలి. అంతేగాకా వారి వయస్సు కనుగుణంగా ఏర్పాటు చేసే జమాఅత్ కార్యక్రమాలలో వారు తప్పక పాల్గొనాలి. పాల్గొనని వారిని గూర్చి ఆయా శాఖలకు చెందిన బాధ్యత గల పదవిదారులు వారికి, వారి తల్లి దండ్రులకు నచ్చజెప్పగలరు. అయిన కూడ వారిలో మార్పు కనిపించనిచో వారు బాలలైనను, బాలికలైనను, యువకులైనను, యువతులైనను వఖ్ఫెనౌ పథకం నుండి తొలిగించబడుటకు చర్యలు తీసుకో బడును. కాని జమాఅత్ కార్యక్రమాలు, ఉప శాఖల కార్యక్రమాలు, వఖ్ఫెనౌ కార్యక్రమాలు ఒకదానికి ఒకటి పోటిపడునట్లుగా ఉండరాదు. వారు ఒక ప్రణాళిక బద్దముగా కార్యక్రమాలను ఏర్పాటు చేసుకోవాలి. ఈ విషయాన్ని ఎల్లప్పుడు అందరు గుర్తుంచుకోగలరు.

నేను ముందుగా తెల్పినట్లు వఖ్ఫెనౌ బాలబాలికలు ప్రత్యేకతను కల్గి యున్నప్పటికి వారు తమ ప్రత్యేకతను నిరూపించుకోవాలి. ఏ విధముగా నిరూపించుకోవాలి?. అల్లాహ్ తాలా అనుబంధములో వారు ముందున్నప్పుడే ప్రత్యేకత కల్గినవారనబడుదురు, వారిలో ఇతరుల కన్న అధిక దైవభీతి కల్గియున్నప్పుడే వారు ప్రత్యేకత కల్గిన వారనబడుదురు, వారి ప్రార్ధన ప్రమాణికములు ఇతరుల కన్న ఉన్నతముగా ఉన్నప్పుడే వారు ప్రత్యేకత కల్గిన వారనబడుదురు, వారు ఫర్జ్ నమాజ్‌లతో పాటు నవాఫిల్ నమాజ్‌లు సల్పినప్పుడే ప్రత్యేకత కల్గిన వారనబడుదురు, వారి సామాన్య ప్రవర్తనల ప్రామణికములు చాలా ఉన్నత స్థాయికి చేరుకున్నప్పుడే వారు ప్రత్యేకత కల్గిన వారనబడుదురు, ప్రత్యేకత కల్గియుండుట అనునది ఒక చిహ్నము. వారి పలుకులు, వారి సంభాషణలు ఇతరుల కన్న ఉన్నతమైన మాధుర్యమును కల్గియున్నప్పుడు, ప్రత్యేక శిక్షణను పొంది, ఎట్టి పరిస్థితిలోనైన ధర్మమునకు ప్రాపంచికముపై ప్రాధాన్యత నిచ్చు వ్యక్తి అని తెలిసినప్పుడే అతడు ప్రత్యేకత కల్గిన వారని అనబడును. బాలికలు మరియు యువతులైనచో వారు తమ వస్త్ర ధారణ, ముసుగు ఇస్లాం బోధనకు అనుగుణంగా సరైన విధముగా ఉన్నప్పుడు మరియు వారిని చూసు వారు వీరు ఈ పాశ్చాత్య దేశములో ఉన్నను వీరి వస్త్ర ధారణ, ముసుగు అసాధారణముగా యున్నవని కొనియాడినప్పుడు ప్రత్యేకత కల్గిన వారనబడుదురు. బాలురైనచో తమ చూపును సిగ్గుతో క్రిందికి మరల్చుచు నడుచు కున్నప్పుడు వారు ప్రత్యేకత కల్గిన వారన బడుదురు, వారు ఇంటర్నెట్ మరియు ఇతర మాధ్యామాల ద్వార వ్యర్ధ కార్యక్రమాలను తిలకించకుండా ఆధ్యాత్మిక బోధను అభ్యసించుటకు సమయంను వెచ్చించినప్పుడు వారు ప్రత్యేకులుగా భావించబడుదురు. బాలురు తమ రూపు రేఖలు ఇతరుల కన్న సహజంగా, ఆకర్షణీయంగా ఉన్నప్పుడే వారు ప్రత్యేకత కల్గిన వారనబడుదురు. వఖ్ఫెనౌ బాల బాలికలు ప్రతి రోజు పవిత్ర ఖుర్‌ఆన్ పారాయణమును చేస్తూ, ఆ గ్రంథ ఆదేశాలను తూచ తప్పక పాటించినప్పుడే వారు ప్రత్యేకత కల్గిన వారనబడుదురు. ఉపశాఖల, జమాఅత్ కార్యక్రమాలలో క్రమం తప్పకుండా ఇతరుల కన్న అధికముగా పాల్గొన్నప్పుడే వారు ప్రత్యేకత కల్గిన వారనబడుదురు. తల్లి దండ్రులతో సత్ప్రవర్తనగా నడుచుకొంటు, వారి కొరకు దుఆలు చేయుచు వారి సోదర సోదరీమణుల కన్న ముందంజలో ఉన్నప్పుడే వారు ప్రత్యేకత కల్గిన వారన బడుదురు. వివాహ సమయాలలో యువతీ యువకులు ప్రాపంచిక విషయాలకు ప్రాధాన్యత నిచ్చుటకు బదులు ఆధ్యాత్మిక విషయాలకు ప్రాధాన్యత నిచ్చినప్పుడే వారు ప్రత్యేకత కల్గిన వారనబడుదురు. అంతేగాకా వారు తమ వివాహ బంధమును కొనసాగించుటకు పూర్తిగా ప్రయత్నిస్తు మేము కేవలం ధార్మిక బోధనాను సారమే మా బంధమును కొనసాగిస్తున్నామని తెల్పుకున్నప్పుడే వారు ప్రత్యేకత కల్గిన వారన బడుదురు. వారిలో ఇతరుల కన్న అధిక సహన శక్తి కల్గి యుండి, జగడము, పీడనము, కలహముల సమయమున వాటి నుండి దూరముంటు సంధి కుదుర్చుకొను వారైనప్పుడే వారు ప్రత్యేకత కల్గిన వారనబడుదురు. ప్రచార కార్యక్రమాలలో ఇతరుల కన్న ముందుకు వచ్చి ఆ బాధ్యతను నెరవేర్చినప్పుడే వారు ప్రత్యేకత కల్గిన వారన బడుదురు. ఖిలాఫత్ పట్ల విధేయతను పాటిస్తూ, ఖలీఫా గారి ఆదేశాలను పాటించుటకు ముందంజలో యున్నప్పుడే వారు ప్రత్యేకత కల్గిన వారన బడుదురు, ఇతరుల కన్న అధిక ఓర్పును కల్గి, అధికముగా త్యాగాలు చేసినప్పుడే వారు ప్రత్యేకత కల్గిన వారనబడుదురు, నిరాడంబరతలో, నిస్వార్ధములో ముందుండి గర్వము, అసహనమునకు వ్యతిరేకముగా పోరాడు వారైనప్పుడే వారు ప్రత్యేకత కల్గిన వారనబడుదురు, మార్గదర్శనము పొందుటకు ఎం.టి.ఏ ద్వారా నా జుమా ప్రసంగమును వినువారు, నా ప్రతి కార్యమును తిలకించు వారు చాలా ప్రత్యేక కల్గిన వారన బడుదురు.

పై విషయాలన్నింటితో పాటు అల్లాహ్ తాలా ప్రీతిని పొందు కార్యములను నెరవేర్చుచు, అల్లాహ్ తాలా క్రోదమునకు కారణమగు కార్యముల నుండి దూరమున్నచో నిశ్చయముగా వారు ప్రత్యేకత కల్గిన వారనబడుదురు. ఆలా కానిచో ఇతరులకు మీకు ఎలాంటి భేదము లేదని గ్రహించాలి. ఈ విషయాలను తల్లిదండ్రులు గుర్తుంచుకోవాలి. ఈ తరహాలో తమ పిల్లలను తీర్చి దిద్దవలెను. నేడు ప్రపంచములో విప్లవమును సృషించుటకు అల్లాహ్ తాలా ఈ ప్రత్యేకతలు కల్గి యున్న మిమ్ములను ఎన్నుకొనెను. అలా తీర్చి దిద్దనిచో, ప్రపంచము వారి నడవడికను చూడుటకు ఇష్టపడనిచో వారు ప్రత్యేకత కల్గిన వారుగా గుర్తించబడరు. పైగా వారు తమ ప్రతిజ్ఞలను పూర్తి చేయని వారిగా, తమ ప్రమాణాలను నెరవేర్చని వారిగా అల్లాహ్ దృష్టిలో నిలిచి పోవుదురు.

సంస్కరణ గల ఈ కాలంలో తమ పిల్లలను ఈ విధముగా స్పెషల్‌గా తీర్చి

| వర్తమాన ఖలీఫా వాఖ్యములు | "అల్లాహ్ మరియు అతని ప్రవక్త పట్ల సంపూర్ణ ప్రేమాభిమానాలు లేనంత వరకు ప్రాపంచిక ప్రేమ తగ్గదు, అదే విధముగా మరణించు సమయంలో మానవునికి మనశ్శాంతి లభించదు, మరణ సమయంలో కల్గె ఆందోళన కూడ దూరం కాదు. " (జుమా ప్రసంగం 14 సెప్టెంబర్ 2018) |
|---|---|

దుఆ ఆశించువారు: *Darga sb, jamat AhmadiyyaVizag (A.P)*



EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail: mdakbar1451@gmail.com

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817

Weekly BADAR Qadian బదర్ తెలుగు వార పత్రిక

Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA

POSTAL REG NO GDP-38/2023-2025, Vol. 10. Thursday, 06 NOV 2025, Issue No - 45

MANAGER
SHAIKH MUJAHID AHMAD
Mobile. : +91 99153 79255
e-mail managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.600/- (Per Issue: 12/- ) (WEIGHT: 20-50, grms / issue)

దిద్దుట తల్లిదండ్రుల బాధ్యత. యవ్వనంలోకి అడుగిడిన తరువాత వాఖ్ఫీనే నౌ ఈ ప్రామాణికములను తమలో కల్గి యుండవలెను.

నేను ముందు తెల్పినట్లుగా ప్రాపంచిక విద్య నభ్యసిస్తున్న తరుణంలో స్వీయ నిర్ణయాలు తీసుకోకుండా మేము ఏ కోర్సులను ఎంచుకోవాలని జమాఅత్ పదవి దారులను అడిగి తెలుసుకోండి. కోర్సులను ఎంచుకొనుటకు ముందు వఖ్ఫెనౌ బాలురు జామియాలో ప్రవేశం పొంది ముబల్లిఘ్ లేదా మురబ్బి అవుటకు మొదటి ప్రాధాన్యత నివ్వవలెనని నేను గతంలోనే తెల్పినాను. నేటి కాలంలో మురబ్బి మరియు ముబల్లిఘ్‌లు మన జమాఅత్‌కు చాలా అవసరం. అల్లాహ్ తాలా అనుగ్రహంతో ప్రపంచములో మన జమాఅత్‌లు రోజు రోజుకు విస్తరిస్తున్నాయి. కేవలం గతంలో జమాఅత్‌లు ఉన్న దేశాలలోనే కాకుండా నూతన దేశాలలో కూడ చాలా వేగంగా జమాఅత్‌లు ఏర్పడు చున్నాయి. కావున మనకు అనేక దేశాలలో సేవలందించుటకు మురబ్బిలు, ముబల్లిఘ్‌లు అధిక సంఖ్యలో కావలెను. అంతేగాకా మన హాస్పటల్స్‌లో సేవలందించుటకు డాక్టర్లు కావలెను. ఖాదియాన్‌లో. పాకిస్తాన్‌లో, ప్రత్యేకించి రబ్వాలో అనేక విభాగాలలో నైపుణ్యత కల్గిన డాక్టర్లు కావలెను. వీరందరిని ఈ ఒక్క దేశం నుండే సిద్దము చేయలేము. కావున నా జుమ ప్రసంగమును వినుచున్న ప్రపంచ అహ్మదీయులు, వఖ్ఫెనౌ బాల బాలికలు ఈ అంశాల వైపు శ్రద్ధను కనబర్చవలెను. మన వద్ద నైపుణ్యత కల్గిన డాక్టర్ల కొరత ఎక్కువగా ఉన్నందున నైపుణ్యత కల్గిన డాక్టర్లు తమను తాము అంకితము చేసుకోగలరు. ఆఫ్రికాలో సాధారణ డాక్టర్లతో పాటు ప్రావీణ్యం గల డాక్టర్ల కొరత చాలా అధికముగా ఉన్నది. ఈ సంవత్సరము గోయిటా మాలాలో ఒక నూతన హాస్పటల్‌ను నిర్మించడం జరుగుతుంది. అక్కడికి కెనడా డాక్టర్లు కూడ వెళ్ళవచ్చును. రాబోవు కాలంలో ఈ డాక్టర్ల అవసరం అధికముగా ఉండును. అదే విధముగా ఇండోనేషియాలో కూడ అవసరం ఉండును. జమాఅత్ వృద్ధి చెందుచున్న కొలది ఈ అవసరం మరింత పెరుగును. అందుకే తమ తమ దేశాలలో ఉన్నత విద్యనభ్యసించి, ప్రావీణ్యతను సాదించి, డాక్టర్లుగా గుర్తింపు తెచ్చుకున్న వఖ్ఫె నౌ యువతి యువకులు ఈ సేవలకై తమను తాము అంకితము చేసుకొనుము. వారికి అనుకూలంగా ఉన్న దేశాలలో వారు సేవలందించ గలరు. కనీసం తమను తాము అంకితం చేసుకున్నచో జమాఅత్ వారిని ఆయా దేశాలలో వారిని సేవలకు నియమిస్తుంది. అదే విధముగా స్కూల్‌లో పాఠాలు బోధించటకు ఉపాధ్యాయులు కూడ అవసరం. ఇందుకు వఖ్ఫె నౌ యువతీ యువకుల ఆవశ్యకత ఉన్నందున వారు సిద్దముగా ఉండవలెను. అదే విధముగా మస్జిద్, మిషన్ హౌజ్, స్కూల్స్, హాస్పటల్స్ మొు॥ వాటిని ఒక ప్రణాళిక బద్దముగా, తక్కువ ఖర్చుతో ఎక్కువ నిర్మాణాలను చేపట్టుచూ, జమాఅత్ ధనమును కాపాడుటకు ప్రావీణ్యత గల ఇంజనీర్లు, ఆర్కిటెక్చరులు కూడ కావలెను. నేటి కాలంలో ఈ శాఖలలో సేవలంది ంచుటకు సేవలకుల అవసరం గలదు. రాబోవు కాలంలో మారుచున్న విధానాలకు అనుగుణంగా ఇతర సేవలకు కూడ సేవలకుల అవసరం తప్పక ఉండును.

కొందరు వఖ్ఫెనౌ బాల బాలికలకు ఇతర విభాగపు విద్యవైపు ఆసక్తి ఉ ండవచ్చును. వారు నా నుండి అనుమతి కోరినప్పుడు వారి కుతూహలంను గుర్తించి వారికి నేను అనుమతిని కూడ ఇస్తాను. కాని నేను విద్యార్థులకు తెలుపునది ఏమనగా వారు అధికముగా సామాన్య శాస్త్రపు అనేక విభాగాలలో పరిశోధనల వైపు శ్రద్ధ చూపుము. ఇందుకై సామాన్య విద్యార్థులు, వఖ్ఫెనౌ విద్యార్థులు అందరు అర్హులే. సామాన్య శాస్త్ర విభాగాలలో పరిశోధనలు జరిపి జమాఅత్ శాస్త్ర వేత్తలుగా గొప్ప గుర్తింపును సాధించండి. ఫలితముగా ధార్మక విద్యను బోధించుటకు జమాఅత్ బోధకుల అవసరం ప్రపంచమునకు ఉన్నట్లే, ప్రాపంచిక విద్యను బోధించుటకు కూడ జమాఅత్ శాస్త్ర వేత్తల అవసరం ప్రపంచమునకు ఉండును. అట్టి పరిస్థితులలో వఖ్ఫె నౌ వారు బాహ్యముగా ప్రాపంచిక సేవ చేయుచున్నను వారు తమ విజ్ఞానం, వివేకం ద్వారా ఏకేశ్వరోపాసాన స్థాపనకు ప్రపంచములో పాటుపడినట్లగును. ఈ విధముగా వారు ప్రపంచములో ఇస్లాం ధర్మమును వ్యాపింప జేసిన వారగుదురు.

అదే విధముగా వఖ్ఫెనౌ వారు ఇతర విభాగాలకు చెందిన విద్యను కూడ అభ్యసించవచ్చును. కాని మేమందరం వఖ్ఫెనౌ కు చెందిన వారము, ఏ సమయంలోనైన మమ్ము ప్రాపంచిక సేవలను వీడి ధార్మిక సేవకు పిలువ వచ్చును, అప్పుడు ఎలాంటి వాదోపవాదాలు చేయకుండా, సాకులను వెతుకకుండా ధార్మిక సేవలో తప్పక పాల్గొందును అనే ప్రాథమిక లక్ష్యంను అందరు గుర్తుంచుకోవాలి.

వఖ్ఫెనౌ వారు గర్తుంచుకోవలసిన మరో ముఖ్యమైన విషయం ఏమిటనగా వారికి ప్రాపంచిక వ్యాపారాలు చేయుటకు అనుమతి లభించును. కాని వారి వ్యాపార లావాదేవీలు అల్లాహ్ ఆరాధన నుండి, ధార్మిక విద్య నభ్యసించుట నుండి, ధార్మిక సేవల నుండి దూరం చేయకూడదనివై ఉండాలి. అంతేగాకా వారి ప్రాథమిక లక్ష్యం ధర్మమునకు ప్రాపంచికముపై ప్రాధాన్యత నిచ్చుటలో ఉన్నత స్థాయిని చేరుకోవలెను. పవిత్ర ఖుర్‌ఆన్ పారాయణం, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పుస్తకముల పఠనము ప్రతి వఖ్ఫె నౌ దిన చర్య కావలెను. వఖ్ఫె నౌ విభాగము వారు 21 సంవత్సరముల వయస్సు వరకు ఒక పాఠ్యాంశమును రూపొందించారు. దాని ప్రకారం అందరు అమలు చేయాలి. 21 సంవత్సరాలకు పై బడిన వారు స్వయంగా ధార్మిక పుస్తక పఠనములు చేయవలెను.

మీరు ఆచరణ్మాతకంగా కాకుండా కేవలం ఒట్టి మాటలతో ప్రయత్నించినచో మీ పిల్లలపై ఎలాంటి ప్రభావం చూపదని నేను వఖ్ఫెనౌ బాల బాలికల తల్లిదండ్రులకు తెలుపుచున్నాను. నమాజ్ సల్పుటలో, పవిత్ర ఖుర్‌ఆన్ పారాయణం చేయడం, చేయించడంలో, ఉన్నత ప్రవర్తనలను ప్రదర్శించుటలో తమ పిల్లలకు తల్లి దండ్రులు ఆదర్శవంతముగా నిలువవలెను. అంతేగాకా ధార్మిక విద్య నభ్యసించుట వైపు తమ పిల్లల శ్రద్ధను మళ్లించవలెను. అసత్యము, అపహాస్యము నుండి దూరముండ వలెను. ఒక పదవి దారునితో బాధ కల్గినప్పుడు జమాఅత్ వ్యవస్థ మరియు పదవి దారులకు వ్యతిరేకముగా గృహములలో చర్చించుకోకూడదు. ఎం.టి.ఏ ద్వారా నా జుమా ప్రసంగాలను క్రమం తప్పకుండా వినవలెను. ఈ విషయాలు కేవలం వఖ్ఫె నౌ బాలబాలికల తల్లిదండ్రులకే తెలుపడం లేదు. తమ సంతానము జమాఅత్ వ్యవస్థతో ముడిపడి యుండాలని భావించే ప్రతి అహ్మదీ తల్లి దండ్రులకు తెలుపుచున్నాను. తమ గృహాలను అహ్మదీ గృహాలుగా మార్చుకొనుము. ప్రాపంచీకుల గృహములుగా మార్చుకుము. అలా కానిచో భావితరాలు ప్రాపంచిక సాధనలో తలమునకలై అహ్మదియ్యత్ నుండి దూరమవడమే గాకా అల్లాహ్ నుండి కూడ దూరమవుతు, తమ ఇహ, పర లోకములను రెండింటిని నాశనము చేసుకొన్న వారగుదురు.

వఖ్ఫె నౌ బాల బాలికలు కేవలం అల్లాహ్ తాలా అనుగ్రహమును, దైవభీతిని పొందడమే గాకుండా వారి కుటుంబ సభ్యుల, బందు మిత్రుల ఆచరణల దుష్పరిమాణాల నుండి కూడ అల్లాహ్ తాలా కాపాడును గాక!. అంతేగాక ప్రతి అహ్మదీ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఆశించిన అహ్మదీయుని వలె మారును గాక!. తద్వారా ప్రపంచములో అహ్మదియ్యత్ అనగా స్వచ్ఛమైన ఇస్లాం జెండాను ఎగరవేయు దృశ్యంను మనమందరం త్వరలోనే చూచు భాగ్యమును కూడ కల్పించును గాక! (ఆమీన్).

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మరొక చోట మనందరిని ఉ ద్దేశించి ఇలా ఉపదేశించిరి: " మానవుడు ఒకటి రెండు సత్కార్యములు చేసి దేవున్ని సంతృప్తి పరిచానను కుంటాడు. వాస్తవానికి అది సాధ్యము కాదు. విధేయతను చూపడం చాలా కష్టమైన పని. అనుచర సమాజం చూపిన విధేయతయే అసలైన విధేయత. ….. విధేయతను ప్రదర్శించడం తేలికేనా?. సంపూర్ణ విధేయతను ప్రదర్శించని వ్యక్తి ఈ జమాఅత్‌ను తలవంపులు తెచ్చును. ఆదేశము ఒకటి కాదు, అనేక ఆదేశాలు గలవు. స్వర్గమునకు ఎన్నో ద్వారాలు ఉన్నట్లు, ఒకరు ఒక ద్వారము నుండి ప్రవేశించినచో మరొకరు మరో ద్వారము నుండి ప్రవేశించెదరు.

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz